


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | బుధవారం | 30.07.2025 | సంపుటి : 2 | సంచిక :177 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Wednesday | 30.07.2025 | volume : 2 | Issue : 177 | Pages : 8 | Cost : 2/- |


## ఆపరేషన్ సిందూర్‌పై సందేహాలా?

### ఉగ్రమూకలను అణచివేస్తే సంతోషించరా

- మాజీ హోంమంత్రికి ఉగ్రవాదుల ఉనికిపై అనుమానాలా
- లోక్‌సభలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రసంగం
- చిదంబరం వ్యాఖ్యలపై గట్టిగా కౌంటర్
- ముగ్గురు పహల్గా ఉగ్రవాదులను మట్టుబెట్టామని వెల్లడి



**న్యూఢిల్లీ, జూలై 29 :**
పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారణంగా ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ చేపట్టిన ఆపరేషన్‌పై విపక్షాలు సంతోషం వ్యక్తం చేస్తాయనుకుంటే.. సందేహాలు వ్యక్తం చేస్తున్నాయంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. లోక్‌సభలో రెండో రోజు మంగళవారం జరిగిన ప్రత్యేక చర్చలో అమిషా మాట్లాడారు. విపక్ష ఎంపీల వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు. ఉగ్రవాదులను మట్టు-బెడితే ఆనందం వ్యక్తం చేస్తారనుకున్నానని.. కానీ విపక్ష సభ్యులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో ఒకసారి ఆలోచించాలంటూ హితవుపలికారు. ఉగ్రవాదులు చనిపోయారన్న సంతోషం వారిలో కనిపించలేదని చెప్పారు. ఉగ్రవాదులు పాక్ నుంచే వచ్చారనేందుకు.. ఆధారాలు ఉన్నాయా అన్న చిదంబరం ప్రశ్నకు అమిత్ షా స్పందించారు. పాక్‌ను కాపాడే ప్రయత్నం చేస్తున్నారా.. అని ప్రశ్నించారు. పాక్‌కు క్లీన్‌చిట్ ఇవ్వాల్సిన అవసరం ఏంటంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా మాట్లాడటం తగదని హితవు పలికారు. ఉగ్రవాదులు పాకిస్తాన్ నుంచి వచ్చారనేందుకు తమ వద్ద ఆధారాలున్నాయని స్పష్టం చేశారు.

## కాల్పుల విరమణలో మూడో దేశం

# జోక్యం లేదు

### ట్రంప్ మధ్యవర్తిత్వ ప్రకటనను తోసిపుచ్చిన మోడీ



- ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రమూకలకు బుద్ధి చెప్పాం
- సిందూర్‌లో త్రివిధ దళాలు సత్తా చాటాయి
- కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేసిన త్రివిధ దళాలు
- ఆపరేషన్‌పై కాంగ్రెస్, విపక్షాల తీరు దారుణం
- ఉగ్రవాదంపై చర్యలు తీసుకోకుండా ఎవరూ అడ్డుపడలేదు
- ప్రపంచం యావత్తూ భారత్‌కు బాసటగా నిలిచింది
- సైనికులకు అండగా నిలవనిది కాంగ్రెస్ ఒక్కటే
- పార్లమెంటులో ప్రధాని మోదీ సుదీర్ఘ సమాధానం

**న్యూఢిల్లీ, జూలై 29 :**
పాక్‌తో కాల్పుల విరమణలో అమెరికా పాత్రను లోక్‌సభ వేదికగా ప్రధాని మోడీ మూడో వ్యక్తి ప్రమేయం లేదని తేల్చి చెప్పారు. ఇదే సందర్భంలో ప్రధాని మోదీ.. కాంగ్రెస్, విపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉగ్రవాదులను మట్టిలో కలిపినందుకు భారత్ విజయోత్సవాలు చేసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం, భారత సేనల శౌర్య, ప్రతాపాల ప్రదర్శన తర్వాత విజయోత్సవాలు చేసుకుంటున్నామన్నారు. 140 కోట్ల భారతీయుల ఐక్యత, ఇచ్ఛాశక్తి ఫలాలతో భారత్ విజయోత్సవాలు చేసుకుంటోందని తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్'పై లోక్‌సభలో వాడీ వేడిగా జరిగిన చర్చకు సమాధానంగా ప్రధాని మోదీ ప్రసంగించారు.

## కాలుష్యరహిత నగరంగా

# హైదరాబాద్

### 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు

### అధికారులకు సిఎం రేవంత్ రెడ్డి ఆదేశం



**హైదరాబాద్, జూలై 29 :**
హైదరాబాద్‌ని కాలుష్యరహి తంగా మార్చేందుకు అవసరమైన సంస్కరణలు తీసుకురావాలని అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వచ్చే 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారంరాష్ట్ర సచివాలయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో పలు కీలక అంశాలపై చర్చించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబులింగ్‌లని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గ నిర్దేశం చేశారు. కోర్ అర్బన్ రీజియన్‌లో కాలుష్య నియంత్రణకు శాశ్వత పరిష్కారం చూపాలని.. ఇందుకు సంబంధించి ఢిల్లీ, బెంగళూరు, చెన్నై లాంటి నగరాల్లో సమస్యలను అధ్యయనం చేయాలని దిశానిర్దేశర చేశారు. హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రాకుండా పరిష్కార మార్గాలను సిద్ధం చేయాలని సూచించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.



02

## రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను

# ఆధునీకరిస్తాం

- ప్రాజెక్టుల్లో పేరుకున్న పూడికను తొలగిస్తాం
- 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న సాగర్
- మంత్రి అడ్లూరితో కలిసి సాగర్ గేట్లు ఎత్తిన మంత్రి ఉత్తమ్



## సైన్యం చేతులు కట్టేసి..

# పాక్‌తో సయోధ్య

- ఉగ్రదాడులకు దీటుగా సమాధానం చెప్పడంలో విఫలం
- దమ్ముంటే ట్రంప్ వ్యాఖ్యలను ఖండించాలి
- ఆపరేషన్ సిందూర్ చర్చపై రాహుల్

02



## సిఎం రమేశ్ ఇంటికి వెళ్లావా లేదా?

- రమేశ్ వ్యాఖ్యలపై ఎందుకు సమాధానం లేదు
- కేటీఆర్‌కు సవాల్ చేసిన మంత్రి సీతక్క

03

## రైతుల కోసం రాజీ లేని పోరాటాలను

# ఉద్ధృతం చేయాలి

### బనకచర్లను ఎట్టిపరిస్థితుల్లోనూ నిలువరించాల్సిందే

### పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం



**హైదరాబాద్, జూలై 29 :** రాష్ట్ర రైతుల సంక్షేమం కోసం... వ్యవసాయ సంక్షోభాన్ని నివారించేందుకు... రాజీ లేని పోరాటాలు మరింత ఉద్ధృతం చేయాలని భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ సాగునీటి రంగాన్ని ఆగం చేసేలా ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును తలపెట్టిందంటూ.. దాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ నిలువరించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం భారాస శ్రేణులను క్షేత్రస్థాయి పోరాటాలకు సిద్ధం చేయాలని ఆయన పేర్కొన్నారు. పార్టీ తరఫున క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై ఎర్రవల్లి నివాసంలో మంగళవారం భారాస అధినేత కేసీఆర్ సుదీర్ఘ సమావేశం నిర్వహించారు.

## భారీగా ఓట్లు తొలగిస్తే

# మా జోక్యం తప్పదు : సుప్రీం

04






## యూరియాపై ప్రభుత్వం

# తప్పుడు లెక్కలు

- లెక్కకు మిక్కిలిన యూరియా ఎక్కడుంది
- జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా సున్నా
- జిల్లా పర్యటనలో కార్యకర్తల సమావేశంలో బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు

02

# అఖిలపక్షంకన్నా ఎన్నికల ప్రచారమే ముఖ్యమా?

- ఉగ్రవాదులను ఏరివేసామని అబద్దాలు ప్రచారం చేస్తారా
- సిందూర్‌పై రాజ్యసభ చర్చలో ఖర్గే ఘాటు వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, జూలై 29:** ఆపరేషన్ సిందూర్ పై రాజసభ్యలోనూ వాడీవేడీ చర్చ జరిగింది. ఈ క్రమంలో రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గేపై సభాపక్ష నేత జేపీ నడ్డా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం తీవ్ర వాగ్వాదానికి కారణమైంది. దీంతో అధికార, విపక్ష సభ్యుల చప్పుళ్లతో సభ కొద్దిసేపు దద్దరిల్లింది. చివరకు తన వ్యాఖ్యలను నడ్డా వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పడంతో సభ సద్దుమణిగింది. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దాదాపు గంటపాటు– ప్రసంగించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీపైనా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఖర్గే ప్రసంగం ముగిసిన వెంటనే స్పందించిన నడ్డా.. కాంగ్రెస్ అధ్యక్షుడు 'మానసిక సమతుల్యత' కోల్పోతున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మోదీపై ఖర్గే చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో నడ్డా చర్యలను తీవ్రంగా తప్పుపట్టిన విపక్షాలు క్షమాపణ చెప్పాలంటూ బల్లలు చరుస్తూ ఆందోళన చేపట్టాయి. అనంతరం ఖర్గే కూడా మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వంలో తాను గౌరవించే మంత్రుల్లో నడ్డా కూడా ఒకరని, అయినప్పటికీ తనపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. వెంటనే కేంద్ర మంత్రి నడ్డా స్పందిస్తూ.. ఇప్పటికే తన మాటలు వెనక్కి తీసుకున్నానని, క్షమాపణ కూడా చెప్పానని అన్నారు. నరేంద్ర మోదీ ప్రపంచంలోనే అత్యంత ఆదరణ ఉన్న నాయకుడు. అందుకు భాజపానే కాదు దేశం మొత్తం గర్విస్తోందని కేంద్ర మంత్రి నడ్డా పేర్కొన్నారు. ఖర్గే మాత్రం ఆయన స్థాయిని పట్టించుకోకుండా అభ్యంతరకరంగా మాట్లాడారని విమర్శించారు. కాంగ్రెస్ అధ్యక్షుడికి సుదీర్ఘ అనుభవం ఉన్నప్పటికీ తన పరిధిని దాటి ప్రధానిపై వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అవి ఆయన స్థాయికి తగినట్లు– లేవని, వాటిని రికార్డుల నుంచి తొలగించాల్సిన అవసరం ఉందని జేపీ నడ్డా పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై ఉభయసభల్లో చర్చ జరుగుతుండగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభలో లేకపోవడాన్ని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే తప్పుపట్టారు. తామంతా అఖిల పక్ష సమావేశంలో పాల్గొంటే ఆయన బీహార్‌లో రాజకీయ ర్యాలీలో పాల్గొన్నారని అన్నారు. ఇంతటి క్లిష్ట సమయంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లడం అవసరమా అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటయ్యాయని ఖర్గే తెలిపారు. తమరు ప్రభుత్వ రంగ కార్ఖానాలు కాదు.. అబద్ధపు కార్ఖానాలు ఏర్పాటు– చేశారని అన్నారు. కీలకమైన అంశంపై పార్లమెంటు లో చర్చ జరుగుతుంటే ప్రధాని నరేంద్రమోడీ సభలో లేరని, కీలకమైన చర్చను వదిలేసి బిహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లారని విమర్శించారు. పహల్గాం ఉగ్రదాడి ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జరిగిందని తెలియజేశారు. పార్లమెంటుకు రాకుండా ఎన్నికల ప్రచారానికి వెళ్లడమే దేశభక్తి అవుతుందా? అని ప్రశ్నించారు. పార్లమెంటు– సమావేశాలు నిర్వహించాలని అడిగితే మోడీ స్పందించలేదని, ఘటన జరిగిన 3 నెలల తర్వాత పార్లమెంటులో చర్చ పెట్టారని మండిపడ్డారు. విపక్షాలు పాకిస్థాన్ కు మద్దతు ఇస్తున్నాయని అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అసత్యాలతో ఎక్కువకాలం ప్రజలను మభ్య పెట్టలేరని అన్నారు. తాము ఎప్పుడూ పాకిస్థాన్ కు మద్దతు ఇవ్వలేదని, ఇవ్వబోము అని చెప్పారు. కాంగ్రెస్ దేశాన్ని నిర్మించిన పార్టీ.. కాంగ్రెస్ కు చాలా చరిత్ర ఉందని కొనియాడారు. పహల్గాం ఘటనతో సంబంధం లేని అంశాలను లేవనెత్తుతున్నారని, పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పోషిస్తోందని ధ్వజమెత్తారు. తాము మొదట నుంచి చెబుతున్నామని, ఉగ్రవాద సమస్య బిజెపి హయాంలో మూడింతలు అయ్యిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదాల మూలాలు దెబ్బతీస్తున్నట్లు– కేంద్ర హోం మంత్రి అమిత్ షా జమ్మూకశ్మీర్ పర్యటనలో చెప్పారని అన్నారు. పాక్ ఉగ్రవాదులు పహల్గాం వరకు ఎలా వచ్చారని, పహల్గాం దాడికి 3 రోజుల ముందు ప్రధాని జమ్మూ పర్యటన రద్దు చేసుకున్నారని ఎద్దేవ చేశారు. ప్రధాని పర్యటన రద్దు చేసుకుంటారని.. పర్యాటకులను ఎలా అనుమతించారని నిలదీశారు. పహల్గాం దాడి కచ్చితంగా భద్రతా వైఫల్యమని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ అన్నారని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

# సిఎం రమేశ్ బ్రోకరిజం అందరికీ తెలుసు

- దాడులకు భయపడి బిజెపిలో చేరింది నిజం కాదా
- కెటిఆర్‌ను గతంలో ఎన్నిసార్లు కలిశావో చెప్ప
- కెటిఆర్‌పై విమర్శలకు కొప్పుల ఈశ్వర్ ఘాటు స్పందన



**హైదరాబాద్, జూలై 29 :** బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందని అంటూ ఎంపీ సీఎం రమేష్ చేసిన వ్యాఖ్యలు 'ఇయర్ ఆఫ్ ది జోక్' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఎన్నటికీ బీజేపీలోనే కాదు.. ఏ పార్టీలో విలీనం కాదన్నారు. సీఎం రమేష్ ఎప్పుడు బీజేపీలో చేరారు అని, బీజేపీలో ఆయనకు ఉన్న పరపతి ఎంత అని ప్రశ్నించారు. కంచెగచ్చిబౌలి భూముల విషయంలో సీఎం రమేష్ మధ్యవర్తిగా ఉన్నారా? లేదా? అని తెలంగాణ ప్రజలకు సీఎం రమేష్ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీది తెలంగాణ భావజాలం అని, బీజేపీది ఆర్ఎస్ఎస్ భావజాలం అని పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే వాళ్లకు బ్రోకరిజం చేసే సీఎం రమేష్ మాటలను తెలంగాణ ప్రజలు పట్టించుకోవద్దని కొప్పుల ఈశ్వర్ చెప్పుకొచ్చారు. కంచె గచ్చిబౌలి భూముల విషయంలో సీఎం రమేష్ మధ్యవర్తిత్వం వహించి 10 వేల కోట్ల రుణాలు ఇప్పించారన్నారు. దీనికి సీఎం రమేష్ సమాధానం చెప్పకుండా, విలీనం అంశం ఎందుకు మాట్లాడుతున్నారు. కంచెగచ్చిబౌలి భూముల విషయంలో సీఎం రమేష్ మధ్యవర్తిగా ఉన్నారా? లేదా తెలంగాణ ప్రజలకు చెప్పాలి. కేటీఆర్ నా ఇంటికి వచ్చి కలిశారని అంటున్న సీఎం రమేష్.. నీ కంపెనీ కోసం, నీ కాంట్రాక్టుల కోసం అధికారంలో వున్నప్పుడు కేటీఆర్ వెంటపడలేదా?. బీఆర్ఎస్ ఎన్నటికీ బీజేపీలోనే కాదు ఏ పార్టీలో విలీనం కాదు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ బీజేపీతో పొత్తు పెట్టు–కోలేదు. భవిష్యత్తులో బీజేపీతో బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి పొత్తు ఉండదని కొప్పుల ఈశ్వర్ అన్నారు. రేవంత్ రెడ్డి ఆఫీస్ నుంచి వచ్చిన స్క్రిప్ట్ సీఎం రమేష్ చదువుతున్నారు. టీడీపి నుంచి రాజ్యసభ ఎంపీ అయ్యి ఈడీ, సీబీఐ కేసులకు భయపడి బీజేపీలో చేరిన సీఎం రమేష్ మాటలకు విలువ ఉందా?. సీఎం రమేష్ చరిత్ర రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెలుసు. ఆంధ్రా ఎంపీ సీఎం రమేష్ అక్కడ ఉన్న కుల పంచాయతీలు తెలంగాణకు తీసుకురావాలని చూస్తున్నారు. ఆయన లాంటి వాళ్ళతో తెలంగాణ ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. సీఎం రమేష్ ప్రస్తావన చేసిన కమ్మ, రెడ్డి సామాజిక వర్గాలకు కేసీఆర్ సీఎంగా వున్నప్పుడు ఉన్న ప్రాధాన్యత ఇప్పుడు ఉందా?. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కమ్మ, రెడ్డి సామాజిక వర్గాల వారు అత్యధికంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎంపీలుగా, పార్టీ పదవుల్లో ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీని అస్థిరపరచాలని రేవంత్ రెడ్డి ఇచ్చిన స్క్రిప్ట్ సీఎం రమేష్ చదివారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ నాయకత్వానికి అన్ని వర్గాలు మద్దతు తెలిపాయి. 2023లో బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోయినా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎక్కువ సీట్లు– గెలిచింది. సెటిలర్స్, కమ్మ, రెడ్డి, అన్ని సామాజిక వర్గాల వారు కేసీఆర్, కేటీ–ఆర్ నాయకత్వానికి ఆమోదం తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తున్న సామాజికవర్గాల వారిని కేటీ–ఆర్ ఎట్లా తిడతారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే వాళ్లకు బ్రోకరిజం చేసే సీఎం రమేష్ మాటలను తెలంగాణ ప్రజలు పట్టించుకోవద్దు' అని కొప్పుల ఈశ్వర్ సూచించారు.

# కాల్పుల విరమణలో మూడో దేశం జోక్యం లేదు

**న్యూఢిల్లీ, జూలై 29:** ఉగ్రవాదంపై చర్యలు తీసుకోకుండా ప్రపంచంలో ఏ దేశం మనల్ని అడ్డుకోలేదని, ఆపరేషన్ సిందూర్‌ను ఆపాల్సిందిగా ఏ దేశ నేత కూడా అడగలేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టంచేశారు. ఉగ్రవాదం నుంచి మనల్ని మనం కాపాడుకునే విషయంలో యావత్ ప్రపంచం నుంచి దేశానికి మద్దతు లభించినా.. కాంగ్రెస్ మాత్రం దేశ సైనికుల శౌర్యపరాక్రమాలకు అండగా నిలబడటంలేదని విమర్శించారు. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌లపై లోక్‌సభలో రెండ్రోజుల్లో 19 గంటలకుపైగా జరిగిన ప్రత్యేక చర్చకు సమాధానంగా మంగళవారం సాయంత్రం ఆయన 102 నిమిషాలు మాట్లాడారు. అంతకుముందు విపక్షాలు ఉభయసభల్లో ప్రభుత్వాన్ని నిలదీశాయి. ముఖ్యంగా భద్రతలో, విదేశాంగ విధానంలో వైఫల్యాలను ప్రస్తావించి ప్రభుత్వ జవాబుదారీతనాన్ని ప్రశ్నించాయి. విపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ తదితరులు ప్రభుత్వంపై విరుచుకుపడగా.. అధికార పక్షం వైపు నుంచి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, మరో మంత్రి నడ్డాలు వారి విమర్శల్ని గట్టిగా తిప్పికొట్టారు. ఉభయసభల్లో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. చివర్లో మోదీ సవివరంగా స్పందించి.. విపక్షాల పాలనలో జరిగిన తప్పిదాలను తనదైన శైలిలో ప్రస్తావించారు. ఉగ్రవాదులను ఏరివేయడంలో ఆపరేషన్ సిందూర్, ఆపరేషన్ మహాదేవ్ కీలక పాత్ర పోషించాయని స్పష్టంచేశారు. భారత్–పాక్ యుద్ధాన్ని నిలువరించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెప్పడంపై విపక్షాల విమర్శలకు సమాధానమిచ్చారు.

## అణ్వస్త్ర బెదిరింపుల్ని బేఖాతరు చేశాం

తమవద్ద అణ్వాస్త్రాలు ఉన్నాయని పాక్ చేసిన బెదిరింపులకు మనం తలొగ్గలేదు. చేసిన దుస్సాహసానికి భారీ మూల్యం చెల్లించుకోవాలని పాక్‌కు తెలుసు. సిందూర్ నుంచి సింధూ (నదీ జలాల ఒప్పందం నిలిపివేత) వరకు మన కార్యకలాపాలు విస్తరించాయి. భారత్‌పై దాడులు చేసినా ఏమీ కాదులే అని గతంలో ఉగ్రవాదులు అనుకునేవారు. ఇప్పుడు మాత్రం అలా దాడిచేస్తే మనం వాళ్ల అంతుచూస్తామని వారికి తెలుసు. మన దేశంలో తయారైన డ్రోన్లు, క్షిపణులు పాక్ ఆయుధ సామగ్రి పాటవమేంటో ఎండగట్టాయి. పాక్ నుంచి వచ్చిన వెయ్యికి పైగా డ్రోన్లు, క్షిపణులను గాల్లోనే నిర్వీర్యం చేశాం. స్వయంసమృద్ధ భారత్ బలాన్ని ప్రపంచం చూసింది. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలను 22 నిమిషాల్లో మట్టుబెట్టి ప్రతీకారం తీర్చుకున్నాం. వాళ్లు కాళ్లబేరానికి వచ్చేలా చేశాం. ఇక ఏమాత్రం భరించలేక.. దాడుల్ని ఆపాలని ఆ దేశ డీజీఎంవో మన డీజీఎంవోను కోరారు.

## వాళ్లు మన దాయాదికి అధికార ప్రతినిధులా?

అణ్వస్త్రపరంగా బెదిరింపులకు దిగాలని పాక్ చూసినా అక్కడి ఉగ్రవాదుల్ని మనం లక్ష్యంగా చేసుకున్నప్పుడు ఏమీ చేయలేకపోయింది. దురదృష్టంకొద్దీ కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మాత్రం మన దాయాది ప్రచారానికి అధికార ప్రతినిధుల్లా మాట్లాడుతున్నాయి. పాక్‌కు కాంగ్రెస్ క్లీన్‌చిట్ ఇవ్వడం దేశాన్ని నివ్వెరపరిచింది. పహల్గాం దాడి ద్వారా దేశంలో అల్లర్లను రెచ్చగొట్టాలని కుట్ర జరిగింది. దేశం ఏకతాటిపై వచ్చి దాన్ని తిప్పికొట్టింది. ఉగ్రవాదుల ప్రధాన కార్యాలయాన్ని నాశనం చేశాం కాబట్టే ఈ పార్లమెంటు సమావేశాలు విజయోత్సవాలు అని నేను చెబుతున్నా. ఉగ్రవాదులు, వారి గురువులు ఊహించలేనంతగా గుణపాఠాన్ని నేర్పిస్తామని చెప్పడానికే నేను మీ ముందు నిల్చొన్నా. సందర్భానికి తగ్గట్టు స్పందించేందుకు మన సైనిక బలగాలకు పూర్తిస్వేచ్ఛ ఇచ్చాం.



### బుల్లెట్‌కు బుల్లెట్టే సమాధానమని జేడీ వాన్స్‌తో చెప్పాం: ప్రధాని మోదీ

"ఆపరేషన్ సిందూర్ ఆపాలని ప్రపంచంలో ఏ నేత కూడా మాకు చెప్పలేదు. మే 9న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నాతో ఫోన్‌లో మాట్లాడారు. పాక్ భారీగా దాడి చేయబోతోందని ఆయన హెచ్చరించారు. పాక్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని జేడీ వాన్స్‌కు చెప్పా. పాక్‌కు ఎవరు సాయం చేసినా.. చూస్తూ ఊరుకొనేది లేదని చెప్పాం. పాక్ ఎలాంటి దాడి చేసినా మేం చూసుకుంటామని వాన్స్‌కు చెప్పాం. బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే సమాధానం చెప్తామని జేడీ వాన్స్‌కు చెప్పాం. పాక్‌కు ఎవరు సహాయం చేసినా.. చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశాం. పాక్‌కు చిరకాలం గుర్తుండిపోయే సమాధానం ఇచ్చాం. పాక్ డీజీఎం అర్ధరాత్రి ఫోన్ చేసి దాడులు ఆపాలని బతిమాలితేనే ఆపరేషన్ సిందూర్ నిలిపివేశాం. " అన్నారు.

### పాక్‌కు అండగా మూడు దేశాలే..

"మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే పహల్గాం దాడులు. ఈ దాడి తర్వాత ఉగ్రవాదులను మట్టిలో కలుపుతామని ప్రతినబూనాం. ద్రోహులకు కలలో కూడా ఊహించని విధంగా శిక్షిస్తామని చెప్పాం. ఉగ్రవాదులకు గట్టి గుణపాఠం చెప్పాలని అఖిలపక్ష భేటీలోనూ చర్చించాం. పాక్ భూభాగంలోకి వెళ్లి ఉగ్రస్థావరాల్ని ధ్వంసం చేశాం. పాక్ ఎయిర్ బేస్‌లు ఇప్పటికీ ఐసీయూలో ఉన్నాయి. అణుబాంబులు బెదిరింపులు చెల్లవని పాక్‌ను హెచ్చరించాం. ప్రపంచ దేశాలు ఆపరేషన్ సిందూర్‌ను సమర్థించాయి. 193 ప్రపంచ దేశాల్లో కేవలం మూడు దేశాలే పాకిస్థాన్‌కు అండగా నిలిచాయి" అన్నారు.

## పీవోకేను ఎందుకు స్వాధీనం చేసుకోలేదో చెప్పాలి

ఒత్తిడితో ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేశామని ఆరోపించడానికి ముందు.. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను ఎందుకు వెనక్కి తీసుకోలేకపోయామో కాంగ్రెస్ చెప్పాలి. మొదట పీవోకేను ఎవరు అలా చేశారో తెలపాలి. జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకుని కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన తప్పుల నొప్పుల్ని మన దేశం ఇప్పటికీ భరించాల్సి వస్తోంది. పాక్ భూమి, ఆ దేశ సైనికులు మనచేతిలో ఉన్నప్పుడు దొరికిన అవకాశాలను కాంగ్రెస్ చేజార్చుకుంది. ఆ పార్టీ ఇప్పుడు పాక్ చేతిలో రిమోట్‌లా మారింది. అందుకే ఆపరేషన్ సిందూర్ ఓ నాటకమని, ఆపరేషన్ మహాదేవ్‌ను ఈ సమయంలో చేపట్టడం ఏమిటని ప్రశ్నిస్తోంది. సింధు నదీజలాల ఒప్పందంలో మనదేశ ప్రయోజనాలకు నెహ్రూ హాని కలిగించారు. ఆయన చేసిన అతిపెద్ద తప్పిదం అది. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలూ ఆ తప్పును సరిచేయలేదు. మేం మాత్రం నీరు, నెత్తురు కలిసి ప్రయాణించలేవని తెగేసి చెప్పాం. భారత్ యుద్ధ దేశం కాదు.. బుద్ధ దేశం. నేనెప్పుడూ భారత ప్రజల పక్షాన నిలబడతాను" అని మోదీ వివరించారు.

## ఉగ్రవాదుల్ని హతమార్చేందుకు తేదీలు, వారాలు చూడాలా?

ఆపరేషన్ మహాదేవ్ ద్వారా పహల్గాంలో దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చినట్లు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో వాడీవేడిగా కొనసాగిన చర్చ అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా విపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఆపరేషన్ మహాదేవ్ నిన్న ఎందుకు చేపట్టారని విపక్షాల నేతలు ఆరోపిస్తున్నారు. ఎప్పుడు పట్టుకున్నారు.. నిన్ననే ఎందుకు కాల్చారంటూ ప్రశ్నిస్తున్నారు. ఉగ్రవాదుల్ని హతం చేయడానికీ తేదీలు, వారాలు చూడాలా?" అని ప్రధాని ప్రశ్నించారు. "సైన్యంపై నమ్మకం ఉన్నచోటే ప్రజాస్వామ్యం సురక్షితంగా ఉంటుంది. దేశం సురక్షితంగా ఉన్నప్పుడే విజ్ఞానపరంగా అభివృద్ధి చెందుతాం. కాంగ్రెస్ ఎప్పుడూ నిరాశాభావంలోనే ఉంటోంది. ఆయుధపరంగా ఎంత పటిష్ఠంగా ఉన్నా.. శాంతి కోసమే ప్రయత్నిస్తాం. పీవోకేను తిరిగి కైవసం చేసుకోవాలని విపక్షాలు అడుగుతున్నాయి. పీవోకేను ఎందుకు వెనక్కి తీసుకురాలేదని కాంగ్రెస్ అడుగుతోంది. ఎవరి కాలంలో పీవోకే.. పాక్ కబ్జాలోకి వెళ్లిందో అందరికీ తెలుసు. దేశభద్రత విషయంలో కాంగ్రెస్ మొదట్నుంచీ ఉదాసీనంగానే వ్యవహరించింది" అని ప్రధాని మోదీ ఆక్షేపించారు.

# సైన్యం చేతులు కట్టేసి.. పాక్‌తో సయోధ్య

- ఉగ్రదాడులకు దీటుగా సమాధానం చెప్పడంలో విఫలం
- దమ్ముంటే ట్రంప్ వ్యాఖ్యలను ఖండించాలి
- ఆపరేషన్ సిందూర్ చర్చపై రాహుల్



**న్యూఢిల్లీ, జూలై 29 :** ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైనికుల చేతులు కట్టేశారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. సాయుధ దళాలకు మద్దతుగా నిలిచే విషయంలో ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం కొరవడిందని విమర్శించారు. తాము యుద్ధం కోరుకోవడం లేదని పాకిస్థాన్‌కు భారత ప్రభుత్వమే తెలియజేసిందన్నారు. 'ఆపరేషన్ సిందూర్ 'పై చర్చ సందర్భంగా లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. పహల్గాం ఉగ్రదాడిని పాకిస్థాన్ కుట్రపన్నిన క్రూరమైన ఘటనగా పేర్కొన్నారు. సాయుధ దళాలను ఉపయోగించాలనుకుంటే.. బలమైన రాజకీయ సంకల్పం ఉండాలి. వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి. కానీ.. ఆపరేషన్ సిందూర్ విషయంలో మన సైనికుల చేతులు కట్టేశారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన సున్నితమైన వివరాలను దాయాదికి వెల్లడించారు. అర్ధరాత్రి 1.05 గంటలకు ఆపరేషన్ ప్రారంభమైందని.. 1.35కు పాకిస్థాన్‌కు ఫోన్ చేసి సైనికేతర లక్ష్యాలను ఛేదించామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారన్నారు. ఉద్రిక్తతలు పెంచే ఆలోచన లేదని దాయాదితో చెప్పామన్నారు. అంటే.. పాక్‌తో యుద్ధం చేసే ఆలోచన లేదని ఆయన చెప్పకనే చెప్పారని రాహుల్ గాంధీ విమర్శించారు. పాక్ విజ్ఞప్తి మేరకు యుద్ధాన్ని ఆపామని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు.. భారత్–పాక్ యుద్ధాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటివరకు 29 సార్లు చెప్పుకొన్నారు. ఇందిరా గాంధీలా ధైర్యం ఉంటే.. ట్రంప్ 'అబద్ధాలకోరు' అని, భారత్ యుద్ధవిమానాలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని ప్రధాని మోదీ లోక్‌సభలో ప్రకటించాలని రాహుల్ డిమాండ్ చేశారు. 'ఆపరేషన్ సిందూర్'కు ముందు అన్ని పార్టీలు ఏకతాటిపై నిలిచాయని, తాను పహల్గాం దాడి బాధిత కుటుంబాలను పరామర్శించినట్లు– తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి అమానుషమని, ఈ దాడి అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ప్రభుత్వానికి మద్దుతు తెలిపాయని, ఇందుకు తాము గర్విస్తున్నామని రాహుల్ గాంధీ అన్నారు.హహల్గాం ఉగ్రదాడిలో పర్యాటకులను అత్యంత కిరాతకంగా కాల్చి చంపారని రాహుల్ అన్నారు. ఉగ్రదాడిలో పిల్లలు, యువకులు, వృద్ధులు చనిపోయారని, భార్య కళ్ల ముందే భర్తను కాల్చి చంపేశారని ఆవేదన వ్యక్తం చేసారు. విపక్షాలుగా దేశ భద్రత విషయంలో తాము ప్రభుత్వానికి అండగా నిలిచామని, ఆపరేషన్ సిందూర్‌కు ముక్తకంఠంతో మద్దతు తెలిపామని చెప్పారు.

# యూరియాపై ప్రభుత్వం తప్పుడు లెక్కలు

- లెక్కకు మిక్కలిన యూరియా ఎక్కడుంది
- ప్రభుత్వం తక్షణమే జవాబు చెప్పాలి
- జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా సున్నా
- ఖమ్మం ఇక బిజెపి అడ్డా కాబతోంది
- బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ దోబూచులాల
- జిల్లా పర్యటనలో కార్యకర్తల సమావేశంలో బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు



**ఖమ్మం, జూలై 29 :** తెలంగాణ రాష్ట్రానికి కేందప్రభుత్వం అందజేస్తున్న యూరియా లెక్కలకు సంబంధించి రేవంత్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు ఆరోపించారు. తెలంగాణకు ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటివరకు 6.14 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాని కేందప్రభుత్వం అందజేసిందని స్పష్టం చేశారు. ఇంకా ఎంత యూరియా కావాలంటే అంత ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. రబీ సీజన్‌లో 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని... కానీ తెలంగాణలో 12.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ఇప్పుడు యూరియా లేదని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని.. రబీలో అదనంగా ఉన్న యూరియా ఇప్పుడు ఎందుకు లేకుండా పోయిందని.. ఎందుకు కొరత వచ్చిందో రేవంత్ ప్రభుత్వం పరిశీలించుకోవాలని సూచించారు. యూరియా విషయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావుకి రామచంద్ర రావు సవాల్ విసిరారు. ఆర్టీఏ చట్టం ద్వారా వివరాలు సేకరిద్దాం అని, తనది తప్పైతే రాజీనామా చేస్తానంటూ సవాల్ చేశారు. యూరియా సరఫరా విషయంలో ఆర్టీఏ చట్టం ద్వారా వివరాలు తీసుకోవచ్చని, అందులో తాము చెప్పేది అబద్ధమైతే తాను రాజీనామాకు సిద్ధమని.. మరి తుమ్మల రాజీనామా చేస్తాడో చూడాలని రామచంద్ర రావు అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లాలో రామచంద్రరావు పర్యటించారు. ఖమ్మం నగరంలో రామచంద్రరావు రోడ్ షో నిర్వహించారు. నగరంలోని సప్తపది ఫంక్షన్ హాల్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడారు.ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారని.. అభివృద్ధి మాత్రం లేదని రామచంద్రరావు ఆరోపించారు. కేందప్రభుత్వం ఇచ్చే నిధులతో ఖమ్మం జిల్లాలో కోట్లాది రూపాయల అభివృద్ధి జరుగుతోందని ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లాలో రాబోయే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఏ ఎన్నికలైనా బీజేపీ అభ్యర్థులదే విజయమని జోస్యం చెప్పారు. ఖమ్మం జిల్లా కమ్యూనిస్టుల గడ్డ కాదని.. ఇకపై బీజేపీ అడ్డా కాబోతోందని ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లాలో చాలామంది కమ్యూనిస్టులు తనకు టచ్‌లో ఉన్నారని తెలిపారు. కమ్యూనిస్టులు బీజేపీలోకి రావాలని స్వాగతం పలికారు. రాజకీయాల కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. తాను చెప్పింది తప్పయితే తాను తన పదవికి రాజీనామా చేస్తానని.. మీది తప్పు అయితే మీరు రాజీనామా చేస్తారా అని తుమ్మలకు సవాల్ చేశారు. తుమ్మల తనకు మిత్రులే అది తర్వాత సంగతి అని చెప్పుకొచ్చారు. బీసీ రిజర్వేషన్ విషయంలో తాము చిత్తశుద్ధితో ఉన్నామని రామచంద్రరావు నొక్కిచెప్పారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆక్షేపించారు. బీసీలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఏ పార్టీలో అయినా ఆ పార్టీ నాయకుడు లేదా ముఖ్యమంత్రి స్థాయి నేతలు ఆయా రాష్ట్రాల్లో పాదయాత్రలు చేస్తారని.. కానీ కాంగ్రెస్‌లో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ జయంతి నటరాజన్ పాదయాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. దీన్ని బట్టి కాంగ్రెస్‌లో ఏం జరుగుతుందో అర్థమవుతోందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ వైఖరిని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. 42 శాతం బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ది బీసీ రిజర్వేషన్ కాదని.. ముస్లింల రిజర్వేషన్ అని ఆరోపించారు. కాంగ్రెస్ బీసీలను మోసం చేస్తోందని విమర్శించారు. తాము ముస్లింల రిజర్వేషన్‌కు వ్యతిరేకం కాదని క్లారిటీ– ఇచ్చారు. ముస్లింలకు ఓబీసీ రిజర్వేషన్ అమలు చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏం చేస్తుందో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ఖమ్మం, నల్గొండ బ్యాచ్ ముఖ్యమంత్రిని సరిగా పని చేయనీయటం లేదని రామచంద్రరావు విమర్శలు చేశారు. ఖమ్మం, నల్గొండ జిల్లా నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పని చేయనివ్వటం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. సీఎం రేవంత్ కుర్చీ కాపాడుకోవాడం కోసమే తన సమయాన్ని వెచ్చించాల్సి వస్తుందని, అందువల్లే మీనాక్షి నటరాజన్ పాదయాత్ర కూడా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇవ్వాలి, కానీ అందులో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించకూడదు. బీసీ బిల్లుకు బేషరతుగా మద్దతు ఇచ్చింది బీజేపీ మాత్రమే. 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాల్సిందే. ఒక్క శాతం తగ్గిన ఊరుకునేది లేదు' అని హెచ్చరించారు. 'మొన్న బండి సంజయ్ చెప్పాడు.. ఇది బీసీ రిజర్వేషన్ కాదు, ముస్లింల రిజర్వేషన్ అని. మేము ముస్లింలకు వ్యతిరేకం కాదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 19 నెలలు అవుతుంది. ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చడం లేదు. కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద దేశంలో ప్రతి రైతుకు డబ్బులు పడ్డాయి. ఖమ్మంలో కూడా బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. తెలంగాణ, ఖమ్మం జిల్లా ప్రజలు బీజేపీ మీద విశ్వాసంతో ఉన్నారు. ఖమ్మం జిల్లాలో గెలుపే లక్ష్యంగా అందరూ పని చేయాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు.

# రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తాం

- ప్రాజెక్టుల్లో పేరుకున్న పూడికను తొలగిస్తాం
- 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న సాగర్
- మంత్రి అడ్లూరితో కలసి సాగర్ గేట్లు ఎత్తిన మంత్రి ఉత్తమ్



నాగార్జునసాగర్, జూలై 29 : రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తామని,అలాగే పూడిక తీస్తామని ,రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ ,మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన చేయబడిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం అని అన్నారు. నాగార్జున సాగర్ మనకు ఆధునిక దేవాలయం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సాగర్ నుంచి గేట్లు ఎత్తడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. 18 ఏళ్ల తర్వాత జులైలోనే నాగార్జున సాగర్ జలాశయం నిండిందని తెలియజేశారు.

### 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు

సాగర్ కు దివంగత ప్రధాని నెహ్రూ గాంధీ పునాది వేస్తే దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారని, 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించిన గొప్ప ప్రాజెక్టు ఇది అని కొనియాడారు. సాగర్ కాలువల ద్వారా రెండు రాష్ట్రాల్లోని ప్రతీ ఎకరాకు నీరు చేరిందని, మన రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి పండిందని ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని 22 లక్షల ఎకరాలకు సాగునీరుతుందని చెప్పారు .జవహర్ కుడి కాలువ ద్వారా 11.74 లక్షల ఎకరాలు, లాల్ బహుదూర్ ఎడమ కాలువ ద్వారా 10.38 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో మొత్తం 6 లక్షల 50వేల ఎకరాలకు సాగు నీరు అందుతుండగా, నల్గొండ జిల్లాలో 1,50,000 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో రెండు లక్షల 30 వేల ఎకరాలు ,ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్ష ఎకరాలకు ఆయకట్టుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా సాగునీరందుతున్నదని తెలిపారు. 2005 సంవత్సరంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు స్వర్ణోత్సవాలు. నిర్వహించడం జరిగిందని చెప్పారు.తను ఆరుసార్లు శాసనసభ్యుడిగా,ఒకసారి పార్లమెంటు సభ్యునిగా ఉంటూ ఇప్పుడు ఇరిగేషన్ ప్రాజెక్టు మంత్రిగా నాగార్జున సాగర్ ద్వారా నీటిని వదలడం సంతోషంగా ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటు- అయిన తర్వాత గత వానాకాలం,యాసంగి , వానాకాలం కలిసి రెండు లక్షల 81 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని. పండించడం జరిగిందని, ఇందులో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పాత్ర ముఖ్యమని అన్నారు. సాగునీటితో పాటు- నాగార్జునసాగర్ పవర్ ప్రాజెక్ట్ ద్వారా గడచిన 4 రోజులుగా 30000 క్యూసెక్కుల నీటిని తో పూర్తిస్థాయిలో,700 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేశామన్నారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి ,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ చౌహాన్,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ ఈ మల్లికార్జునరావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు. కాగా నాగార్జున సాగర్ ప్రాజక్ట్ ద్వారా మంత్రులు 6 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువ కు వదిలిన తర్వాత అధికారులు 14 గేట్ల ద్వారా 10932 క్యూసెక్కుల నీరు వదిలారు.మంగళవారం సాయంత్రం వరకు 20 గేట్ల ద్వారా 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వడలనున్నట్లు- ప్రాజక్ట్ అధికారులు తెలిపారు. అనంతరం మంత్రులు,అధికారులు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ను సందర్శించి కృష్ణ జలాలకు పుష్పాభిషేకం చేశారు.

---

# భూ వివాదం కేసులో సీఎం రేవంత్ రెడ్డికి ఊరట

## పెద్దిరాజు తదితరులు వేసిన పిటిషన్ తిరస్కరణ



**న్యూఢిల్లీ, జూలై 29 :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. భూవివాదం కేసులో ఎన్ పెద్దిరాజు వేసిన కేసులో.. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు క్వాష్ చేసింది.అయితే హైకోర్టు ఆదేశాలపై ఎన్ పెద్దిరాజు సుప్రీంకోర్టులో సవాలు వేశారు. ఈ కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ సుప్రీంను ఆశ్రయించారు. ఆ పిటిషన్‌లో హైకోర్టు తీర్పునకు సంబంధించిన అంశాలతో పాటూ జడ్జి పైన అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు- సమాచారం. ఎన్ పెద్దిరాజు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. అలాగే ఎన్ పెద్దిరాజుతో పాటు-, ఆయన అడ్వకేట్ రితేష్ పాటిల్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సీజేఐ బీఆర్ గవాయి తదుపరి విచారణకు పిటిషనర్ అండ్ పెద్దిరాజు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించారు. భూ వివాదం వ్యవహారంలో సొసైటీ- స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని 2016లో రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మయ్య పై పెద్దిరాజు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పీఎస్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. తనపై కేసును కొట్టివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి 2020లో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. ఫిర్యాదు దారు ఆరోపణల్లో సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంది. రేవంత్‌పై నమోదైన కేసును కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పు అనంతరం.. కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ పెద్దిరాజు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిష్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం డిస్మిస్ చేసింది.పిటిషన్‌లో.. ఉత్తర్వులు ఇచ్చిన హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నాయని సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. ఒక న్యాయవాదిగా న్యాయమూర్తిపై వ్యాఖ్యలు చేస్తూ .. పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్.పెద్దిరాజుతోపాటు- ఆయన తరఫు న్యాయవాది రితేష్ పాటిల్‌కు ధర్మాసనం కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణకు పిటిషనర్ పెద్దిరాజు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలిచ్చింది. కోర్టు సాక్షిగా పిటిషనర్ తరఫు న్యాయవాది రితీష్ పాటిల్ క్షమాపణ కోరారు. అందుకు నిరాకరించిన సీజేఐ.. పిటిషన్ రాసేటప్పుడు, దాఖలు చేసేటప్పుడు గుడ్డిగా ఎలా వేశారని ప్రశ్నించారు. పిటిషన్ ఉపసంహరించుకునేందుకు అనుమతివ్వాలని న్యాయవాది రితీష్ పాటిల్ కోరగా.. అందుకు సీజేఐ నిరాకరించారు. పిటిషన్ దాఖలు చేసే ముందు న్యాయవాదిగా అన్ని విషయాలు చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోవద్దంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. కోర్టు ధిక్కరణ నోటీసుపై లిఖిత పూర్వకంగా సమాధానం ఆదేశించారు. సమాధానం ఆమోదయోగ్యంగా ఉంటేనే కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని స్పష్టం చేస్తూ విచారణ ఆగస్టు 11కు వాయిదా వేశారు.

---


# సరస్వతీ పవర్ షేర్ల బదిలీ కుదరదు

## జగన్‌కు భారీ ఊరట

**హైదరాబాద్, జులై 29 :** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు భారీ ఊరట లభించింది. సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ వాటాల బదిలీపై జగన్ వేసిన పిటిషన్‌ను అనుమతించింది. విజయలక్ష్మి, షర్మిలకు వాటాలు బదిలీ నిలుపుదల చేయాలని జగన్ పిటిషన్ పై విచారణ జరిపిన ధర్మాసనం.. జగన్ వాదనలతో ఏకీభవించింది. విజయ లక్ష్మి, షర్మిలకు బదిలీ అయిన వాటాలను నిలుపుదల చేస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పును విజయమ్మ, షర్మిల హైకోర్టు లో సవాల్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా గతంలో తన అన్న వదిన కలిసి తమకు సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్‌లో రావాల్సిన వాటాలను ఇవ్వడం లేదని షర్మిల, విజయలక్ష్మి పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుస్తాం : పొన్నం

**హైదరాబాద్, జూలై 29 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ నుంచి గట్టి పోటీ ఉందని వివరించారు. పలువురు నేతలు జూబ్లీహిల్స్ నుంచి పోటీకి ఆసక్తి చూపుతున్నట్లు- పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం ఎవరికి టికెట్ ఇస్తే వారే పోటీ చేస్తారని తెలిపారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థిపై సర్వే జరుగుతోందని వెల్లడించారు. అభ్యర్థులు ఎవరున్నా.. అందరూ కలిసి పనిచేస్తారని తెలిపారు. జూబ్లీహిల్స్‌లో ఈసారి కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేస్తున్నమంచి పనులే గెలిపిస్తాయని అన్నారు. బిఆర్ఎస్‌ను ఎవరూ నమ్మడం లేదన్నారు.



# శ్రీశైలం ఏడుగేట్లు ఎత్తివేత

**నంద్యాల, జూలై 29 :** శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వస్తోంది. 7 గేట్లు- 10 అడుగులు ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. ఇన్ ఫ్లో 2,59,116 క్యూసెక్కు లు కాగా.. ఔట్ ఫ్లో 2,55,811 క్యూసెక్కులు ఉన్నట్లు- అధికారులు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 883 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. శ్రీశైలం నీటి నిల్వ సామర్థం 215.8070 టీ-ఎంసీలుకాగా ప్రస్తుతం నీటి నిల్వ 204.7880 టీ-ఎంసీలుగా ఉంది.

---

# బీసీ రిజర్వేషన్ల కోసం 72 గంటల నిరాహార దీక్ష

- ప్రభుత్వ అనుమతితో 4 నుంచి దీక్షకు దిగుతా
- లేదంటే ఎక్కడుంటే అక్కడే దీక్ష చేస్తా
- జాగృతి అధ్యక్షురాలు కవిత హెచ్చరిక



**హైదరాబాద్, జూలై 29 :** బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆగస్టు 4, 5, 6 తేదీల్లో తాను 72 గంటల పాటు నిరాహార దీక్ష చేయబోతున్నానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం ప్రకటించారు. ప్రభుత్వ అనుమతి కోరి దీక్షకు దిగుతానని ఒక వేళ అనుమతి ఇవ్వకపోతే ఎక్కడ కూర్చుంటే అక్కడే నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. ఉమ్మడి రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహ సాధన కోసం తాను 72 గంటలు దీక్ష చేస్తే నాటి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం దిగివచ్చిందని గుర్తు చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ .... 2018 పంచాయతీ రాజ్ సవరణ చట్టాన్ని సవరణ చేస్తూ తెలంగాణ జాగృతి చేసిన డిమాండ్ తోనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసిందని చెప్పారు. తమిళనాడులో గవర్నర్ జాప్యం చేస్తే కోర్టుకు వెళ్లి తీర్పు తెచ్చుకున్నారని మరి తెలంగాణ ప్రభుత్వం గవర్నర్ వద్ద పెండింగ్ అంశంపై కోర్టుకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. గవర్నర్, రాష్ట్రపతి వద్ద ఉన్న పెండింగ్ బిల్లులపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్తే సానుకూల తీర్పు వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే కోర్టులో కేసు వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీకి ఉన్న ఒప్పందం కారణంగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోర్టుకు వెళ్లడం లేదని కవిత ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో కేసు వేయాలన్నారు. తాము ఢిల్లీలో చేసే ధర్నాకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అంటు-న్నారు... ఇదేమైనా సత్రం భోజనమా ? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అఫీషియల్ గా అఖిలపక్షంను ఢిల్లీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. అఖిలపక్షం ఢిల్లీకి రావాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, అన్ని రాజకీయ పార్టీలకు ప్రభుత్వం లేఖలు రాయలన్నారు. పొన్నం ప్రభాకర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం డ్రామా చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా శూన్యం అని రిజర్వేషన్ల విషయంలో బీజేపీ తప్పించుకుంటోందని విమర్శించారు. బీజేపీ బీసీ సీఎం, బీసీ పీఎం అంటు-న్న బీజేపీకీ బీసీలపై చిత్తశుద్ధి లేదని కవిత ధ్వజమెత్తారు.

---



# మరోమారు హైడ్రా దూకుడు

## మూసీ కాలువలో భారీ కబ్జాల కూల్చివేత

**హైదరాబాద్, జూలై 29 :** హైడ్రామరోమారు కొరడా ఝుళిపించింది. ఆక్రమణలపై వేటు వేసింది. హైదరాబాద్ ఎంజీబీఎస్ వద్ద మూసీ నదిలో ఆక్రమణలను హైడ్రా సిబ్బంది తొలగించారు. కొందరు ప్రైవేటు- వ్యక్తులు మూసీలో మట్టి పోసి పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు. ఒక్కో బస్సు నుంచి రూ.300, ఒక్కో గుడిసె నుంచి రూ.1000 వసూలు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ స్థలంపై హైడ్రాకు ఫిర్యాదులు అందడంతో అధికారులు స్పందించారు. ప్రభుత్వ ఆదేశాలతో పార్కింగ్ స్థలాన్ని హైడ్రా పరిరక్షించింది. ఇలా మూసీనది గర్భంలో ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు. చాదరఘాట్ బ్రిడ్జి నుంచి పాత బస్తీ ఉస్మానియా ఆస్పత్రి మార్చురీ వరకు పలు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించారు. ఈ స్థలాన్ని వాహనాల పార్కింగ్ కోసం ఆక్రమణ దారులు వినియోగిస్తున్నారు. చదును చేసి షెడ్డులు నిర్మించిన కబ్జాదారులు కిరాయికి ఇస్తున్నారు. మూసీ ఆక్రమణలపై హైడ్రాకు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో చర్యలు చేపట్టారు. 3.10 ఎకరాల మేర కబ్జా చేసి షెడ్డు నిర్మించిన ఆక్రమణ దారు తికారంసింగ్ అక్రమ వ్యాపారం చేస్తున్నారు. అలాగే 1.30 ఎకరాల మేర కబ్జా చేశారు ఆక్రమణ దారు పూనమ్ చాంద్ యాదవ్. 5.22 ఎకరాల మేర కబ్జా చేశారు జయకృష్ణ. కబ్జా చేసిన వారంతా అక్కడ షెడ్లు వేసి.. వాటిని అద్దెకు ఇచ్చి వ్యాపారం చేస్తున్నట్లు హైడ్రా అధికారులు వెల్లడించారు. బస్సులు, లారీల పార్కింగ్ కోసం కిరాయికి ఇస్తూ ఆక్రమణ దారులు వినియోగిస్తున్నారు. ఆ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు- స్థానికులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. మూసీ గర్భంలో మట్టిపోసి షెడ్డులని నిర్మించినట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. నర్సరీ బిజినెస్ నిర్వహణ, ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు. హైడ్రా అధికారులు తీసుకుంటున్న చర్యలపై పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

---



# సిఎం రమేశ్ ఇంటికి వెళ్లావా లేదా?

- రమేశ్ వ్యాఖ్యలపై ఎందుకు సమాధానం లేదు
- కేటీఆర్‌కు సవాల్ చేసిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూలై 29 :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మంత్రి సీతక్క సవాల్ విసిరారు. రాజ్యసభ ఎంపి సిఎం రమేష్ ఇంటికి వెళ్లిన విషయంపై కెటిఆర్ ఎందుకు స్పష్టత ఇవ్వడంలేదని అడిగారు. కెటిఆర్ అబద్దాలకోరు అనేది సిఎం రమేష్ మాటల్లో తెలుస్తుందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపితో బిఆర్ఎస్ కుమ్మక్కు కాలేదని కేటీఆర్ ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కశాతం ఓట్లు తేడా వస్తే పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓట్లన్నీ బిజెపికి వెళ్లాయని.. కెటిఆర్ గుండెపై చేయి వేసుకొని ఈ విషయంపై క్లారిటీ- ఇవ్వాలని సీతక్క డిమాండ్ చేశారు. లిక్కర్ స్కామ్‌లో ఎంఎల్‌సి కవిత అరెస్టు తరువాత తన ఇంటికి కేటీఆర్ వచ్చారని రాజ్యసభ ఎంపి సిఎం రమేష్ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. కవితను విడుదల చేస్తే బిఆర్ఎస్‌ను బిజెపిలో విలీనం చేస్తానన్నారని సిఎం రమేష్ మీడియాతో చెప్పారు. కేటీఆర్‌గురించి చెప్పాలంటే చాలా విషయాలు ఉన్నాయని తనకు సంస్కారం అడ్డువస్తుందన్నారు. కవిత అరెస్ట్ తర్వాత నువ్వే నా ఇంటికి వచ్చావు. బీజేపీలో బీఆర్ఎస్‌ను విలీనం చేస్తానని అప్పుడే చెప్పావు. కవితను విడుదల చేస్తే బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తానని నువ్వు చెప్పిన విషయం మరిచిపోయావా? అని ప్రశ్నించారు. అలాగే, 'నా వల్లే నువ్వు ఎన్నికల్లో గెలిచావు. కేవలం 300 ఓట్ల మెజారిటీతో గెలిచిన విషయం నీకు తెలుసు. నీ గురించి చెప్పాలంటే చాలా విషయాలు ఉన్నాయి, కానీ నా సంస్కారం అడ్డువస్తోందని సీఎం రమేష్ అన్నారు. ఈ క్రమంలో కేటీఆర్‌కు మంత్రి సీతక్క సవాల్ విసిరారు. సీఎం రమేష్ ఇంటికి వెళ్లిన విషయంపై కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు. కేటీఆర్ అబద్ధాలు మాట్లాడుతారనేది ఎంపీ రమేష్ మాటల్లో చూశాం.. ఎన్ని అబద్ధాలు చెప్పినా.. కొద్దీ రోజుల్లో నిజం తెలుస్తుందని మంత్రి సీతక్క వెల్లడించారు.

---




## బీసీ రిజర్వేషన్ల విషయంలో

# మభ్య పెడుతున్న కాంగ్రెస్

- పాత రిజర్వేషన్లతో ఎన్నికలు జరిపేలా కుట్రలు
- ఢిల్లీకి వెళతామని కొత్త డ్రామాలకు తెర లేపారు
- ఆగస్ట్ 8న కరీంనగర్ వేదికగా బిసి సభ
- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్

**హైదరాబాద్, జూలై 29 :** బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రజలను కాంగ్రెస్ మభ్య పెడుతోందని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. చివరికి పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్తుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న నాటకాలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి, పార్టీ నేతలతో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. ఎలా చేస్తారని అప్పుడు అడిగితే మా వ్యూహం మాకు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెపమంతా భాజపా, భారత రాష్ట్ర సమితిపై నెట్టేస్తోంది. 42 శాతం రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల విషయంలో బీసీలకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. భారత రాష్ట్ర సమితి తరఫున కూడా రాష్ట్రపతిని కలిసి.. 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని కోరతాం. అధికార యంత్రాంగంలోనూ కీలకమైన స్థానాలను ఓ అగ్రవర్ణం వారికే ఇచ్చారు. కార్పొరేషన్ పదవుల్లో సగం బీసీలకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తలసాని డిమాండ్ చేశారు. ఆగస్టు 8వ తేదీన కరీంనగర్ జిల్లాలో బీసీల భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు- ఈ సదర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల అమలుపై తెలంగాణ భవన్‌లో మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన బీసీ ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తూ వస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరపున త్వరలోనే బీసీ ప్రతినిధుల బృందం రాష్ట్రపతిని కలవనుందని తెలిపారు. ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చిందని మండిపడ్డారు. పారదర్శకత లేకుండా కులగణన జరిపి, హడావుడి గా అసెంబ్లీలో ప్రభుత్వం బిల్లును పెట్టిందన్నారు. రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగానే ఆర్డినెన్స్ తీసుకొస్తామనడం రాజ్యాంగ విరుద్ధం. 9వ షెడ్యూల్‌లో చేర్చితేనే చట్టబద్ధత లభిస్తుందని అసెంబ్లీలో తాము స్పష్టం చేసినం. అమలు కాదని తెలిసే కాలయాపన చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మభ్య పెడుతుందన్నారు. ఢిల్లీలో ధర్నా చేస్తామనడం కొత్త డ్రామాకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని అన్నారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీల వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్తాము. మీ చేతుల్లోనే ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీలో 42 శాతం రిజర్వేషన్ ఎందుకు అమలు చేయరు. మిగిలిన మూడు మంత్రి పదవులను బీసీలకు ఇచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. వివిధ ప్రభుత్వ శాఖలలో కూడా బీసీలను అణచివేస్తున్నారు. 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుండా ఎన్నికలు జరిపితే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.

## సంపాదకీయం

# పులుల సంరక్షణతోనే జీవ వైవిధ్యం!



దేశంలో పర్యావరణంపై ఆసక్తి, శ్రద్ధ లేకుండా పోతోంది. మానవజాతి పెరుగుతున్నా కొద్దీ పక్కనున్న ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారు. అడవులను నరికివేస్తూనే..అడవుల్లోని జంతుజాలాన్ని కూడా ఉనికి లేకుండా చేస్తున్నారు. దీంతో ఇప్పటికే అనేక జంతుజాతులు నశించాయి. మనం బతికితే చాలు...మిగతా ఏమయితే ఏమిటన్న ధోరణి ప్రబలింది. ఈ క్రమంలో అడవుల విధ్వంసంతో జంతుజాలం నశిచింది. ప్రపంచవ్యాప్తంగా విచక్షణారహితంగా అడవుల నరికివేత, అక్రమంగా పులులను వేటాడడం లాంటి పలు కారణాలతో పులి జాతి అంతరించే స్థాయికి చేరడాన్ని గమనించిన ఐరాస ప్రతి ఏట 29 జులై రోజున 'అంతర్జాతీయ పులుల దినం లేదా ఇంటర్నేషనల్ టైగర్ డే' పాటించడం ఆనవాయితీగా మారింది. 2010 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. పులులను కాపాడుకోవడం, వాటి ఆవాసాలను సంరక్షించుకోవడం, అక్రమ వేటలను మానుకోవడం, జీవ వైవిధ్యాన్ని కాపాడే ప్రాధాన్యాన్ని వివరించడం, టైగర్ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం చేయడం, టైగర్ రిజర్వులను నియంత్రించడం లాంటి అంశాల్లో సామాన్య జనాలకు అవగాహన కల్పించడానికి ఈ వేదికలను ఉపయోగించుకోవాలి. పిల్లుల జాతిలో అతి పెద్ద జంతువుగా పులికి పేరుంది. 2025 అంతర్జాతీయపులుల దినం ఇతివృత్తంగా మానవులు, పులులు సామరస్యంగా సహజీవనం చేయడం అనే అంశాన్ని తీసుకొని పులుల సంరక్షణ బాధ్యతలను వివరించడం జరుగుతుంది. ఇటీవల ఆదిలాబాద్ కవ్వాల్ రక్షణకు జివో 49ని తెలంగాణ ప్రభుత్వం తీసుకుని వచ్చింది. కానీ అందరూ ఒక్కటై దానిని అమలు చేయకుండా పక్కన పెట్టేయించారు. ఇది అమలు చేయడం ద్వారా పులుల సంరక్షణకు ప్రభుత్వం పూనుకుంది. కానీ గిరిజనుల జీవనానికి ఇది అడ్డంకిగా మారిందన్న ఆందోళనతో పులుల రిజర్వ్ ఫారెస్ట్ రోణ పక్కకు పోయింది. నిజానికి ఇది ప్రజల్లో అవగాహన లేమి కారణంగా జరుగుతున్నదని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. జీవవైవిధ్యం కాపాడటంలో పులులదే కీలక పాత్ర. వాటికి తెలియకుండానే అడవిని రక్షిస్తుంటాయి. మొక్కలను తినే జీవ జాతులను పులులు చంపి తినకపోతే అడవి అనేదే మిగలదు. అంటే...సాధు జంతువులను వేటాడుతూ...పులులు ఎకో సిస్టమ్‌ను బ్యాలెన్స్ చేస్తూ ఉంటాయి. అయితే రానురాను అడువులు ధ్వంసం అవుతుండటం వల్ల వీటి సంఖ్య తగ్గిపోతోంది. అవి మనుగడ సాగించేందుకు అవసరమైన అనుకూల వాతావరణం ఉండటం లేదు. క్రమంగా ఇవి అంతరించి పోయే ప్రమాదముందని గుర్తించిన ప్రపంచ దేశాలు, ఏటా జులై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం జరుపుకుంటున్నారు.

ఒక పులి సంచరించే ప్రాంతం చుట్టు-పక్కల మరో పులి సంచరించదు. 25 నుంచి 30 కిలోమీటర్ల మేర ఒక పులి తన సామ్రాజ్యాన్ని విస్తరిస్తుంది. ఫుడ్ పిరమిడ్లో అగ్రస్థానంలో ఉండే పెద్ద పులి నివసించాలంటే ప్రాంతంలో చిన్నా, పెద్దా అన్నిరకాల జంతువులుండాలి. మంచి వర్షపాతం ఉండాలి. పచ్చని చెట్లతో కూడిన దట్టమైన అడవి ఉండాలి. అందుకే ఈ లెక్కన ఇప్పుడున్న పరిస్థితుల్లో పులులు. మనుగడ సాగించాలంటే...ఒక్కో పులికి 25 వేల ఎకరాల అడవిని కాపాడుకోవాల్సి ఉంటుందని శాస్త్రవేత్తలు తేల్చిచెప్పారు. పులి తన ప్రాణాలు కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతుంది. మూడేళ్ల వయసు రాగానే మగ పులి సొంత సామ్రాజ్యాన్ని ఏర్పాటు-చేసుకునేందుకు ప్రయత్నిస్తుంది. అయితే అడవులు అంతరించడం. అడవుల్లో నీటి కుంటలు లేకపోవడం వల్ల అవి ఊళ్లలోకి రావాల్సి వస్తోంది. నగరాలు పెరగడం, గ్లోబలైజేషన్ ప్రభావంతో రానురానూ అడవులు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం 93 శాతం పులులు కేవలం అడవుల నరికివేత వల్ల అంతరించిపోతున్నాయని ఓ అధ్యయనంలో వెల్లడైంది. ప్రస్తుతం కేవలం ఆరు జాతుల పులులు మాత్రమే మనుగడ సాగిస్తున్నాయి. అనేక టైగర్ జాతులు పూర్తిగా అంతరించి పోయాయి. 2014 వరల్డ్ వైడ్ ఫండ్ లెక్కల ప్రకారం వందేళ్ల క్రితం సుమారు లక్ష పులులు ఉండేవి. కాని ఇప్పుడు వాటి సంఖ్య చాలా తగ్గిపోయిందని వరల్డ్ వైడ్ ఫండ్ ప్రతినిధులు చెబుతున్నారు. పులుల సంఖ్య పెరగడం ద్వారా ఎకో సిస్టమ్ లో మంచి మార్పులు రావడమే కాకుండా, పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుంది. పులులు అంతరిపోవడానికి వేట, వాతావరణ మార్పులతోపాటు, పులులకు షెల్టర్ లేకపోవడం ముఖ్యమైన కారణాలు. అంతేకాకుండా పులి చర్మం, గోళ్లకు డిమాండ్ ఎక్కువ. చైనీస్ సంప్రదాయ వైద్యంలో పులుల గోళ్లు, పళ్లు,మీసాలను ఉపయోగిస్తారు. వాటి కోసం ఎక్కువ ధర చెల్లిస్తారు. అందుకే పులుల వేట, స్మగ్లింగ్ కూడా ఎక్కువైంది. దీంతో కేవలం పులులు మాత్రమే కాదు. ఇతర జీవులు కూడా మెల్లగా అంతరిస్తున్నాయి. కేవలం అడవుల్ని నరకడం వల్లనే దాదాపు 93 శాతం వాటి ఆవాసాల్ని కోల్పోతున్నాయని సర్వేలు వెల్లడిస్తున్నాయి. పులుల్ని, ఇతర జీవరాశులని సంరక్షించుకోవాలంటే.. అడవులు పెంచడం ఒక్కటే మార్గమని అర్థం అవుతోంది.

అడవులు పెంచడం ద్వారా జంతువుల సంఖ్య పెరగడమే కాక పర్యావరణ సమతుల్యం కూడా దెబ్బ తినకుండా ఉంటుంది. వాతావరణ మార్పులు కూడా జంతువులు అంతరించ డానికి కారణం కాబట్టి వాతావరణ మార్పులకు కారణమయ్యే ప్లాస్టిక్, కాలుష్యాన్ని కూడా తగ్గించాల్సిన అవసరం ఏర్పడింది. మనదేశంలో పులి జాతీయ జంతువు కాబట్టి కొంతవరకైనా పులుల్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా మేలుకోకపోతే ఉన్న నాలుగు జాతులు కూడా అంతరించిపోయే ప్రమాదం ఉందని గత కొన్నేళ్ల నుంచి -టైగర్ ట్రాకర్స్ వ్యవస్థను బలపరిచారు. ప్రపంచం మొత్తం మీద ఉన్న పులుల సంఖ్యలో సగానికి పైగా మనదేశంలోనే ఉన్నాయి. పులులను కాపాడుకోవల్సిన అవసరాన్ని మనదేశం ఎప్పుడో గుర్తించింది. 1972లోనే పులిని జాతీయ జంతువుగా ప్రకటించి, తర్వాతి ఏడాది నుంచే ప్రాజెక్ట్ -టైగర్ ను ప్రారంభించింది. పులుల్ని వేటాడే వారికి కఠిన శిక్షలు పడేలా చట్టాలు తెచ్చినా వాటి అంతం ఆగడం లేదు. వాటి సంరక్షణ కోసం భారీగా ఖర్చు చేస్తోంది. దేశంలో 48 పులి అభయారణ్యాలను ఏర్పాటు- చేశారు. పులుల సంరక్షణ గురించి ప్రజల్ని చైతన్యవంతం చేయడం కోసం ఇండియన్ రైల్వే.. టైగర్ ఎక్స్ ప్రెస్ పేరుతో టూరిస్ట్ రైలు సేవలను కూడా ప్రారంభించింది. ఇందులో బాంధవగడ నేషనల్ పార్క్, కన్హా నేషనల్ పార్కులో సఫారీకి తీసుకెళ్తారు.ప్రపంచ పులుల్లో 70 శాతానికి పైగా భారత్‌లోనే ఉండడం విశేషం. నేడు పులుల జనాభా వృద్ధి రేటు-6.1 శాతంగా నమోదు అవుతున్నది. శతాబ్దం క్రితం ఒక లక్ష వరకు ఉన్న పులులు నేడు కేవలం 5,574 మాత్రమే ఉండడం విచారకరం. పులుల ఆవాసాలైన అడవులను నరికి వేస్తుండటంతో అవి మానవ ఆవాసాల్లోకి రావడం జరుగుతోంది.పులుల్లో చాలా అరుదైన జాతి రాయల్ బెంగాల్ -టైగర్.. దీన్ని పెద్ద పులి అంటారు. ఇది మన దేశం లో తప్ప ఇంకెక్కడా కనిపించదు. బెంగాల్ టైగర్ గాండ్రింపు సుమారు రెండు కిలోమీటర్ల వరకు వినిపిస్తుంది. ఇవి రోజుకు దాదాపు 21 కిలోల మాంసాన్ని తింటాయి. పులులు అడవిలో వాటి సరిహద్దులను అవే ఏర్పాటు- చేసుకుంటాయి. ఆ సరిహద్దులకు లోపల వున్న ప్రాంతమంతా వాటి సామ్రాజ్యమే. ప్రతి రెండేళ్లకోసారి ఒక్కో ఆడ పులి రెండు నుంచి నాలుగు పిల్లల్ని పెడుతుంది. పులులు పుట్టిన 18 నెలల నుంచే వేటాడటం మొదలు పెడతాయి. ఇలా పులులను రక్షిస్తేనే అడవులు పెరుగుతాయి.

### భారీగా ఓట్లు తొలగిస్తే

# మా జోక్యం తప్పదు : సుప్రీం




**న్యూఢిల్లీ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో..ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ విషయంలో వెరిఫికేషన్ పత్రాల్లో ఆధార్, ఓటర్ ఐడీ కార్డులను చేర్చకపోవడంపై సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై నేడు విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) విషయంలో ఎన్నికల సంఘానికి రాజ్యాంగ అధికారం ఉందని.. అది చట్ట ప్రకారం పని చేస్తుందని వ్యాఖ్యానించింది. అయితే..భారీగా ఓట్లు తొలగింపునకు గురైతే మాత్రం తాము జోక్యం చేసుకుంటామని స్పష్టం చేసింది. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణపై దాఖలైన పిటిషన్లను ఆగస్టు 12, 13 తేదీల్లో విచారిస్తామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చిలతో కూడిన ధర్మాసనం పేర్కొ ంది. ఆగస్టు 1న ఎన్నికల కమిషన్ ప్రచురించే ఓటర్ల జాబితా నుంచి అనేక మంది ఓటర్లను తొలగించారని..దీనివల్ల వారంతా తమ ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని సర్వోన్నత న్యాయస్థానానికి తెలియజేశారు. దీనిపై స్పందిస్తూ..సుప్రీం ఓటరు జాబితాల్లో ఏదైనా తప్పులను గుర్తిస్తే ఆధారాలతో సహా తమ దృష్టికి తీసుకురావాలని పిటిషనర్‌లకు సూచించింది. వారు భయపడుతున్నట్లు జరిగితే వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుంటామని హామీ ఇచ్చింది. ఈ అంశాలపై ఆగస్టు 8లోగా పిటిషనర్లు తమ లిఖితపూర్వక సమర్పణలను దాఖలు చేయాలని ధర్మాసనం సూచించింది. త్వరలో బిహార్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఓటర్ల సంతకాలను ఫోర్జరీ చేసి, వారి స మ్మతి లేకుండానే ఆన్‌లైన్‌లో సమర్పించారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఇందులో భాగంగానే బిహార్‌లో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ నిలిపివేతకు మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరుతూ పలువురు సుప్రీంలో పిటిషన్ వేశారు. అయితే దీనిపై ప్రస్తుతం స్టే ఇవ్వలేమని సోమవారం ధర్మాసనం పిటిషనర్‌లకు స్పష్టం చేసింది.

### ఉగ్రవాదుల ఏరివేతలో

# 'సిందూర్, మహాదేవ్'లది కీలక పాత్ర

### ప్రధాని నరేంద్ర మోడీ



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో చేసిన ప్రసంగంపై ప్రధాని నరేంద్ర మోడీ స్పందించారు. ఉగ్రవాదులను ఏరివేయడంలో ఆపరేషన్ మహాదేవ్, ఆపరేషన్ సిందూర్ ఆపరేషన్లు కీలక పాత్ర పోషించాయని స్పష్టం చేశారు. వీటి గురించి హోంమంత్రి సుదీర్ఘ వివరణ ఇచ్చారని అన్నారు. దేశ భద్రతపై భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆయన తన ప్రసంగంలో సవివరంగా చెప్పారంటూ ట్వీట్ చేశారు. అంతకుముందు ఇదే అంశంపై లోక్‌సభలో అమిత్ షా ప్రసంగిస్తూ ప్రతిపక్షాల తీరుపై ధ్వజమెత్తారు. అసలు దేశం అభివృద్ధి చెందకపోవడానికి, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ఉనికికి నెహ్రూనే కారణమని ఆరోపించారు. 1948లో భారత సైనిక దళాలు పీవోకేను చేజిక్కించుకునే స్థానంలో ఉన్నప్పటికీ అప్పటి ప్రధాని ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించడం వల్ల ఆ అవకాశం చేజారిపోయిందన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ కూడా నెహ్రూ చర్యలను వ్యతిరేకించారని గుర్తు చేశారు. తూర్పు పాకిస్థాన్ విమోచన యుద్ధం సమయంలోనూ పీఓకేను దక్కించుకునే అవకాశం వచ్చినప్పటికీ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని చేజార్చుకుందని అమిత్ షా పేర్కొన్నారు. అంతేకాకుండా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ శాశ్వత స్థానాన్ని పొందకపోవడానికి కూడా నెహ్రూనే కారణమన్నారు. ఆయన నిర్ణయాల వల్లే మనకు ఇంకా స్థానం దక్కలేదని దుయ్యబట్టారు. యూఎన్ఎస్‌సీలో శాశ్వత సభ్యత్వం కోసం మోదీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. దేశంపై ఉగ్రవాదులు కుట్రలకు పాల్పడుతుంటే చూస్తూ కూర్చోవడానికి ప్రస్తుతం ఉన్నది మన్మోహన్ సింగ్ ప్రభుత్వం కాదని.. మోదీ ప్రభుత్వమంటూ అమిత్ షా ఉద్ఘాటించారు.

# వానదేవుడే బొగ్గును మాయం చేశాడు

- భారీ వర్షాలకు కొట్టుకుపోయి ఉంటుంది
- మేఘాలయ మంత్రి ఆసక్తికర సమాధానం
- 4వేల టన్నుల బొగ్గు మాయంపై హైకోర్టు ఆగ్రహం



**షిల్లాంగ్, జూలై 29 :** మేఘాలయాలో సుమారు నాలుగు వేల టన్నుల బొగ్గు అదృశ్యమైంది. ఆ నల్ల బంగారం మాయం కావడం పట్ల రాష్ట్ర సర్కారుపై హైకోర్టు సీరియస్ అయ్యింది. బొగ్గు ఎక్కడికెళ్లిందో చెప్పాలని కోర్టు నిలదీసింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన ఎక్సైజ్ శాఖ మంత్రి కిర్మెన్ షిల్లా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బహుశా వర్షాలు, వరదల వల్ల ఆ బొగ్గు కొట్టుకుపోయి ఉంటుందని ఆయన అన్నారు. జోరు వానల వల్ల బొగ్గు మాయమై ఉంటుందన్నారు. రాజాజూ, డెంగన్‌గాన్ గ్రామాల్లో ఉన్న బొగ్గు నిల్వల నుంచి సుమారు 4 వేల టన్నుల బొగ్గు కనిపించకుండాపోయింది. ఆ కేసులో అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బొగ్గు మాయం గురించి అడిగిన సమయంలో మంత్రి మాట్లాడుతూ.. మేఘాలయాలో అత్యధిక వర్షపాతం కురుస్తుందని, మీకు ఈ విషయం తెలియదని, ఆ వానల వల్ల బొగ్గు కొట్టుకుపోయే ఛాన్సు ఉందని అన్నారు. బొగ్గు ఎలా అదృశ్యమైందో చెప్పడం తన ఉద్దేశం కాదు అని, సహజ పద్ధతిలో ఆ బొగ్గు మాయమైందా లేక అక్రమ విధానాల వల్ల అది పోయిందా అన్న విషయాన్ని తేల్చలేకపోతున్నట్లు ఆయన చెప్పారు. మేఘాలయాలో 2014 నుంచి బొగ్గు మైనింగ్‌ను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆపేసింది. పర్యావరణ కారణాలు, అసురక్షిత పద్ధతుల వల్ల బొగ్గు తొవ్వకాలను నిలిపివేశారు. మేఘాలయాలో అక్రమ రీతిలో మైనింగ్ జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయినా ఈ ఏడాది ఆరంభంలో ఈస్ట్ జైంతియా కొండల్లో బొగ్గు మైనింగ్‌ను ప్రారంభించారు. ఒకవేళ బొగ్గు మాయమైనా.. అది బ్రతకడం కోసమైతే అక్రమంగా జరిగి ఉంటుందేమో అని, లేదంటే ఆ బొగ్గును ఎవరు తీసుకెళ్తారని మంత్రి అన్నారు.

# 'సీఎం పోస్టు'పై ఖర్గే ఆవేదన.. సమర్థించిన డీకే



**కర్ణాటక :** ఇటీవల ఓ కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ గతంలో కర్ణాటకలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు తాను శ్రమించినా, పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రి బాధ్యతలను ఎస్.ఎం.కృష్ణకు అప్పగించిందన్న మాటలను కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సమర్థించారు. ఖర్గే కాంగ్రెస్ పార్టీ కోసం అవిశ్రాంతంగా పని చేసిన సీనియర్ నాయకుడని.. ఆయన తన భావాలను వ్యక్తపరచడంలో ఎటువంటి తప్పు లేదని అన్నారు. అయితే రాజకీయాల్లో ఉన్నవారు తమ భావాలను వ్యక్తపరచవచ్చు కానీ.. అది బహిరంగంగా మాత్రం కాదన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. కర్ణాటకలోని బేలిమఠంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఖర్గే మాట్లాడుతూ.. తాను ఎన్నడూ అధికారం కోసం వెంపర్లాడలేదన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు తాను శ్రమించినా, పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రి బాధ్యతలను ఎస్.ఎం.కృష్ణకు అప్పగించిందని గుర్తుచేసుకున్నారు. ముఖ్యమంత్రి స్థానం దక్కకపోగా, తన సేవలన్నీ వృథా అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటికీ నిరాశకు గురికాకుండా పార్టీ శ్రేయస్సు కోసం శ్రమించడంతోనే తనకు ఏఐసీసీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించారని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా..కొంతకాలంగా కర్ణాటకలో సీఎం పదవికి సంబంధించిన విషయంలో పలు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో నేడు సిద్దరామయ్య డీకే శివకుమార్ లేకుండానే విధానసౌధలో ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించడంతో ఇరువురి మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నాయా అని మీడియా డీకే శివకుమార్‌ను ప్రశ్నించింది. దీనికి ఆయన బదులిస్తూ..అవేమీ లేవని అన్నారు. సీఎం నిధుల విషయంలో శాసనసభ్యులతో సమావేశం నిర్వహిస్తున్నారని..అందులో తనకు ఎటువంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. బెంగళూరు అభివృద్ధికి సంబంధించిన విషయంలో తాను కూడా కొందరు ఎమ్మెల్యేలతో సమావేశమైనట్లు తెలిపారు. తమ ప్రభుత్వంపై భాజపా చేస్తున్న విమర్శలపై శివకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



### కేరళ నర్సు నిమిష ప్రియ

# ఉరిశిక్ష రద్దు!

### వార్తలను ఖండించిన కేంద్రం

**న్యూఢిల్లీ, జూలై 29 :** కేరళ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దయ్యిందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఖండించాయి. అవన్నీ అవాస్తవమని పేర్కొన్నాయి. నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దు కాలేదని మంగళవారం వెల్లడించాయి. నిమిష ఉరిశిక్షను రద్దు చేస్తూ యెమెన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందంటూ భారత గ్రాండ్ ముఫ్తీ, సున్నీ మత ప్రబోధకుడు కాంతపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ కార్యాలయం సోమవారం రాత్రి ప్రకటించింది. అక్కడ జరిగిన ఉన్నత స్థాయి భేటీలో ఉరిశిక్షణ రద్దు నిర్ణయం తీసుకున్నట్లు-తెలిపింది. దీనిపై భారత విదేశాంగ శాఖ వర్గాలు తాజాగా స్పందించాయి. నిమిష మరణశిక్ష రద్దు చేశారంటూ కొంత మంది వ్యక్తులు నుంచి వచ్చిన సమాచారం అవాస్తవమని వెల్లడించాయి. ఈ విషయంపై తమకు యెమెన్ నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక సమాచారం రాలేదని పేర్కొన్నాయి. యెమెన్ జాతీయుడు మహద్ హత్యకేసులో నిమిష ప్రియకు మరణశిక్ష పడిన విషయం తెలిసిందే. మహద్‌తో కలిసి ఆమె వ్యాపారం చేసింది. అయితే ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ఆమె తన పాస్‌పోర్టు కోసం అడిగింది. కానీ పాస్‌పోర్టు ఇచ్చేందుకు మహద్ నిరాకరించడంతో అతడికి మత్తుమందు ఇచ్చి తీసుకునేందుకు నిమిష ప్రయత్నించింది. అయితే డోస్ ఎక్కువ కావడంతో మహద్ మరణించాడు. దాంతో యెమెన్ పోలీసులు నిమిషను హత్య కేసులో అరెస్ట్ చేశారు. ఆమె ముందుగా స్థానిక కోర్టు మరణశక్ష విధించింది. ఆ శిక్షను టాప్ కోర్టు సమర్థించింది. దాంతో ఈ నెల 16న నిమిషకు ఉరిశిక్ష అమలు చేయనున్నట్లు- ప్రకటించారు. నిమిషకు శిక్ష తప్పించేందుకు చివరి నిమిషం వరకు ప్రయత్నించిన భారత ప్రభుత్వం.. ఇక తాను చేసేదేమీ లేదని చేతులెత్తేసింది. జూలై 16న అమలు చేయాల్సిన మరణశిక్ష చివరి నిమిషంలో వాయిదా పడింది.

# పహల్గాం వరకు ఎలా వచ్చారు? : ఖర్గే

**న్యూఢిల్లీ :** దేశంలో ఉగ్రమూలాలు దెబ్బతిస్తే.. మరి ఉగ్రవాదులు పహల్గాం వరకు వచ్చి ఎలా దాడి చేశారంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. పహల్గాంలో భద్రతాపరమైన లోపాలకు హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. 'ఆపరేషన్ సిందూర్'పై చర్చ సందర్భంగా రాజ్యసభలో ఖర్గే ప్రసంగించారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో దేశ సాయుధ దళాల శౌర్యపరాక్రమాలను 'ఇండియా' కూటమి ప్రశంసించిందని, దేశ ప్రయోజనాల కోసం కేంద్రానికి మద్దతు ఇచ్చిందని గుర్తుచేశారు. "పాకిస్థాన్‌కు విపక్షాలు మద్దతు ఇస్తున్నాయని అసత్య ప్రచారాలు చేస్తున్నారు. అబద్ధాలతో ఎక్కువకాలం ప్రజలను మభ్యపెట్టలేరు. మేం ఎప్పుడూ ఆ దేశానికి మద్దతు ఎవ్వలేదు. ఇవ్వబోము. ఉగ్రవాదాన్ని పాక్ పోషిస్తోందని మొదటి నుంచి చెబుతున్నాం. భాజపా హయాంలో ఉగ్రవాద సమస్య మూడింతలు పెరిగింది. ఉగ్రదాడులను నిరోధించడంలో ప్రభుత్వం తన లోపాలు, వైఫల్యాలను అంగీకరించాలి. ఆపరేషన్ సిందూర్ సమయంలో దాయాది దాడుల నుంచి సరిహద్దు ప్రజలను రక్షించడంలోనూ కేంద్రం తగు చర్యలు తీసుకోలేదు. పహల్గాం దాడికి ఎవరు బాధ్యత వహిస్తారు? ఈ ఉగ్రదాడిలో ప్రమేయమున్న మిగిలిన ఉగ్రవాదులనూ గుర్తించి, శిక్షించాలి. అదేవిధంగా.. సరైన విదేశాంగ విధానాన్ని రూపొందించాలి" అని ఖర్గే వ్యాఖ్యానించారు. భారత్- పాకిస్థాన్ కాల్పుల విరమణ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనం వహిస్తున్నారంటూ ఖర్గే ప్రశ్నించారు. మూడో పక్షం జోక్యాన్ని భారత్ సహించదన్నారు. పహల్గాం ఉగ్రదాడిపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని గైర్హాజరు కావడాన్ని మరోసారి తప్పుపట్టారు.



### ఆఫీసు బిల్డింగ్ పైనుంచి దూకి

# టెకీ ఆత్మహత్య

**పుణె :** మహారాష్ట్రలోని పుణెలో ఓ ఐటీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆఫీసులో మీటింగ్ జరుగుతుండగా మధ్యలో బయటకు వెళ్లిన ఆ టెకీ.. భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాసిక్‌కు చెందిన 23 ఏళ్ల పీయూష్ అశోక్ కవాడే పుణెలోని హింజెవాడి ఐటీ పార్క్‌లోని ఓ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. రోజూలాగే సోమవారం ఉదయం ఆఫీసుకు వచ్చిన అతడు కంపెనీ మీటింగ్‌కు హాజరయ్యాడు. మధ్యలో అస్వస్థతగా ఉందని చెప్పి మీటింగ్ నుంచి బయటకు వచ్చాడు. ఆ తర్వాత కొన్ని క్షణాలకే బిల్డింగ్ ఏడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో తోటి ఉద్యోగులంతా ఉలిక్కిపడ్డారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద సూసైడ్ నోట్‌ను గుర్తించారు. "జీవితంలో విఫలమయ్యా. నన్ను క్షమించండి. మీకు కొడుకుగా ఉండేందుకు నాకు అర్హత లేదు" అని కుటుంబసభ్యుల నుద్దేశిస్తూ లేఖ రాసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. పీయూష్ గతేడాది జులైలోనే ఈ కంపెనీలో చేరాడు. పనిఒత్తిడి, మానసిక సమస్యల కారణంగానే అతడు బలవన్మరణానికి పాల్పడి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



## ఎమ్మెల్యే సాంబశివరావుకు వినతి పత్రం అందజేసిన ఉద్యమకారుల ఫోరం నాయకులు

**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** సిపిఐ రాష్ట్ర కార్యదర్శి శాసనసభ పక్ష నేత శాసన సభ్యులు కూనమనేని సాంబశివరావు కు ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఉద్యమకారులకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయించి ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేర్చే దిశగా ప్రయత్నం చేయాలని ఆయను ఈ సందర్భంగా కోరారు. అనంతరం ఉద్యమకారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని గత అసెంబ్లీలో ప్రస్తావించినందుకు ఆయనకు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు శీలం స్వామి, ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్, ఉద్యమ కళాకారుల జిల్లా అధ్యక్షుడు మల్లం వెంకటేశం గౌడ్, బత్తి రవీందర్ గౌడ్, ఐటి పాముల పుష్ప,ఎక్కల దేవి శ్రీనివాస్ ,కదిరేని స్వామి, కన్నె కంటి శ్రీనివాసచారి, శ్రీరాములు, దండ మల్లికార్జున్, బొడిగెసుదర్శన్ పాల్గొన్నారు.



## కేపీఆర్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు పండ్లు పంపిణీ

**ఆత్మకూరు (ఎం), రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో కేఎచ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా జడ్పీ హై స్కూల్,ప్రైమరీ స్కూల్స్, అన్ని అంగన్వాడీ సెంటర్ లలో విద్యార్థులకి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు కొప్పుల హరిదీప్ రెడ్డి కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కేఎచ్ఆర్ ఫౌండేషన్ సభ్యులు నాగయ్య, మంగ శ్రీను,యాట ప్రవీణ్, యాట మల్లికార్జున్,దండు నవీన్,ఉదేశ్,శశి,హరికృష్ణ, మత్యగిరి, మహేష్,రాఖీ,ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.




## నారాయణ పాఠశాలలో ఘనంగా క్యాబినెట్ ఇన్వెస్టిచూర్ సెర్మనీ వేడుకలు

### హాజరైన సిఐ శ్రీనివాస్ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ శశిధర్ రెడ్డి

**శంకర్‌పల్లి, రాజముద్ర న్యూస్ :** శంకర్‌పల్లి పట్టణంలోని నారాయణ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్యాబినెట్ ఇన్వెస్టిచూర్ సెర్మనీ వేడుకలు ఘనంగా నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శంకర్ పల్లి సిఐ శ్రీనివాస్ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ శశిధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వారు మాట్లాడుతూ... విద్యార్థినీ, విద్యార్థులు చిన్నతనం నుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, అందరితో కలిసి మెలిసి ఉండాలని సూచించారు. అలాగే సేవా భావాలను పెంచుకోవాలని, ఇతరుల పట్ల ఎల్లప్పుడూ గౌరవంగా నడుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిఎం గోపాల్ రెడ్డి, డిజిఎం వల్లి కుమార్, ప్రిన్సిపాల్ దివ్య, కోఆర్డినేటర్స్ కనకరాజు, అనూష, వనిత, డీన్ శ్రీకాంత్, కార్తీక్, విపిఎస్ సనోవార, భాగ్యలక్ష్మి, ఎఓ రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భవనం పైనుండి పడి వ్యక్తి మృతి



**శంకర్‌పల్లి, రాజముద్ర న్యూస్ :** భవనం పై నుండి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శంకర్ పల్లి సిఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం లింగంపల్లి తండాకు చెందిన నేనావత్ సంతోష్(33) శంకర్ పల్లి పట్టణ పరిధిలోని హైదరా బాద్ రోడ్డులో పివిఆర్ డెవలపర్స్ లో సూపర్వైజర్ గా పని చేస్తున్నాడు. పనిచేస్తున్న క్రమంలో మంగళవారం ఉదయం 5వంతస్తు నుండి ప్రమాదవశాత్తు జారి కింద పడటంతో గమనించిన స్థానికులు గాయత్రి ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందు తూ మ-రణించాడు. ఇట్టి విషయంపై మృతుని భార్య సంతోష ఇచ్చిన ఫిర్యాదు మే రకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.



## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ఆలేరు, రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ పరిధిలోని మొదటి వార్డులో, వారం రోజుల క్రితం షాగా లక్ష్మి అనారోగ్యంతో మరణించింది. వారి కుటుంబానికి ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ 50 కిలోల బియ్యాన్ని పంపించారు. భవిష్యత్తులో లక్ష్మి కూతురు స్రవంతి వివాహానికి కూడా సహాయం చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, ఆడేపు బాలస్వామి, భేతి రాములు, కుండే సంపత్, సారాబు సంతోష్ గుప్త, వార్డ్ అధ్యక్షుడు కటక మల్లేష్, జంగా శ్రీధర్, బొట్ల పద్మ, పగడాల బాలరాజు, మహిళా అధ్యక్షురాలు సుజాత, యూత్ అధ్యక్షుడు ఎలగల వంశీ, మొరగాడి బాలరాజు, బొట్ల రంజిత్, ఎస్ కె హైదర్ పాల్గొన్నారు.

# పామ్ ఆయిల్ సాగు ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చు

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** పామ్ ఆయిల్ పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులతో ఆర్థికంగా బలపడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచించారు. మంగళవారం వికారాబాద్ పరిసర ప్రాంతంలోని కొత్రేపల్లిలోని కాసాని జ్ఞానేశ్వర్ వ్యవసాయ క్షేత్రంలో చేపట్టిన మెగా ఆయిల్ ఫామ్ ప్లాటేషన్ డ్రైవ్ లో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి రైతులను ఆదుకునే దిశగా పనిచేస్తుందన్నారు. పామ్ ఆయిల్ పంట సాగుతో అధిక లాభాలు ఆర్జించడంతో పాటు మూడు సంవత్సరాల పాటు అంతర్గత కూరగాయ పంటలతో వ్యవసాయం సాగు చేయవచ్చునని మంత్రి తెలిపారు. ఆయిల్ ఫామ్ పంటకు ప్రభుత్వం సబ్సిడీని అందిస్తూ రైతులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. రైతులకు మొక్కలు ఇవ్వడంతో పాటు డ్రిప్ పరికరాలను అందించే విధంగా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయిల్ ఫామ్ పంటలను సాగు చేసుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలని అదేవిధంగా మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలు వేసుకునే విధంగా అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. అధిక దిగుబడి వచ్చే విత్తనాలను రైతులకు అందించాలని మంత్రి సూచించారు. జిల్లాలో పెద్ద మొత్తంలో ఆయిల్ ఫామ్ పంటలను సాగు చేసినట్లయితే రైతులకు అందుబాటులో ఉండే విధంగా ఫ్యాక్టరీని శంకుస్థాపన చేసుకుందామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునే దిశగా రైతు భరోసా, రైతు బీమా పథకాలను అమలుపరుస్తున్నామని, త్వరలోనే పంటల బీమా ను కూడా వర్తింప చేస్తామని మంత్రి తెలిపారు. శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధికంగా ప్రాముఖ్యత నిస్తూ రైతుల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నర లోనే వ్యవసాయ రంగం కోసం లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసిందని, రైతులను రుణ బారం నుండి విముక్తులను చేయడానికి 25 లక్షల మంది రైతులకు చెందిన 21 వేల కోట్ల రుణాలను మాఫీ చేయడం జరిగిందని సభాపతి తెలిపారు. రైతు భరోసా ను ఏడాదికి ఎకరాకు 12 వేలకు పెంచి కేవలం తొమ్మిది రోజులలో తొమ్మిది వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో వేయడం జరిగిందని ఆయన అన్నారు. రైతు బీమా, సన్న రకాల వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్, వ్యవసాయ రంగానికి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతుల కష్టాలు తీర్చడానికి భూ భారతి తీసుకువచ్చని ఆయన అన్నారు. మన వికారాబాద్ జిల్లాలో మంచి సారవంతమైన భూములు ఉన్నాయని, ఆయిల్ ఫామ్ పంటకు అనుకూలంగా ఉంటాయని ఆయన తెలిపారు. వరి పంటకు అవసరమైన ఒక్క ఎకరం నీటితో నాలుగు ఎకరాల ఆయిల్ ఫామ్ తోటలను సాగు చేయవచ్చని,నాటిన మొదటి నాలుగు సంవత్సరాలు 50 వేల 918 రూపాయలను ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుందని ఆయన తెలిపారు. ఆయిల్ ఫాం మొక్కలను ఒకసారి నాటితే 40 సంవత్సరాల వరకు దిగుబడి ఇస్తుందని ఆయన అన్నారు. దొంగల భయం, కోతుల బెడద, చీడపీడలు బాధ ఉండదని ఆయన అన్నారు. ఆయిల్ ఫామ్ గెలలను ఫ్యాక్టరీ వాళ్ళే డైరెక్ట్ గా కొనుగోలు చేస్తారు కాబట్టి మార్కెటింగ్ ఇబ్బందులు కూడా ఉండవని సభాపతి తెలిపారు. మన దేశం ఏడాదికి లక్ష కోట్ల విలువైన ఆయిల్ ఫామ్ ను విదేశాల నుండి దిగుమతి చేసుకుంటుందని కాబట్టి మన దగ్గర ఎప్పటికీ డిమాండ్ ఉంటుందని ఆయన అన్నారు. ఆయిల్ ఫామ్ తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలని , ఆయిల్ ఫామ్ తోటల సాగుకు ఆసక్తి ఉన్న రైతులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని సభాపతి అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ళ పాలనలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సాగునీరు అందించే పథకాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, ప్రాణహిత- చేవెళ్ల, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల పనులకు నిధులు ఇవ్వలేదని అన్నారు. ప్రాణహిత చేవెళ్ల పథకం ద్వారా వచ్చే అయిదేళ్ళలో మన ప్రాంతానికి సాగు నీరు తెస్తానని సభాపతి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ హాష్మీన్ భాష, డిప్యూటీ డైరెక్టర్ నీరజ గాంధీ , జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి సత్తార్, వ్యవసాయ శాఖ అధికారి రాజా రత్నం, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టు లక్ష్యం

- 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి
- బునాదిగాని కాలువ, పిల్లాయిపల్లి కాలువ, గంధమల్ల ను పూర్తి చేయాలి
- ఆపరేషన్ కగార్ పేరుతో కమ్యూనిజాన్ని అంతం చేయలేరు
- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు



**వలిగొండ రాజముద్ర న్యూస్ :** కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీ బిల్లును అసెంబ్లీలో ప్రవే పెట్టడంతో అందులో అన్ని రాజకీయ పార్టీల ఆమోదం తెలిపిన కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న పార్లమెంట్లో దాని ప్రవేశ పెట్టకుండా ఆడుకుంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. మంగళ వారం సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా 4వ మహాసభ వలిగొండ మండల కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్ లో జరిగింది. మహాసభ సందర్భంగా ఏర్పాటు చేసిన సిపిఐ జెండాను సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే, పల్లా వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాంబశివ రావు మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత శ్రమ-జీవులు, కార్మికులు కలిగిన పెద్ద పార్టీ కమ్యూనిస్టు అని ప్రపంచంలో ఏ దేశంలోనైనా కమ్యూనిస్టులు ఉంటున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్, బిజెపి లాంటి ఇతర బూర్జువా పార్టీలు వారి ప్రాంతాలకు పరిమిత మైతారని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలుగా పూర్తి చేసుకుందని, పేదల పక్షాన నిలబడేది ఎర్ర జెండా పార్టీ అని ఆయన కొనియాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను అమిత్ షా 2026 మార్చి వరకు అంతం చేస్తామని చెప్పడం దుర్మార్గం అన్నారు. మావోయిస్టులు అంటే ఎవరో కాదని,వారు మనవాళ్లేనని ఆపరేషన్ కగార్ పేరు తో చంపడం అటవీక న్యాయమా అని ప్రశ్నించారు. దేశంలో మావోయిస్టులను చంపుతుంటే ప్రశ్నించింది సిపిఐ మాత్రమేనని. అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేసి కగార్ ఆపరేషన్ ఆపాలని నిలదీసింద న్నారు. దేశంలో దోపిడీ చేసేవారు చట్టసభలలో ఉంటే ప్రజల కోసం పనిచేసేవారు అడవులలో, రోడ్లమీద ప్రజల మధ్య ఉంటే పాలకులు వీరిపై అక్రమంగా పెట్టిన కేసులతో, నిర్బంధంతో జైల్లో ఉన్నారని వీరిని కాపాడుకో వాల్సిన బాధ్యత ప్రజల పైన ఉందన్నారు. భారతదేశంలో ఎప్పుడో ఒకప్పుడు కమ్యూనిస్టుల రాజ్యం వస్తుందన్నారు. వివిధ కారణాల వల్ల విడిపోయిన కమ్యూనిస్టులంతా బేషజా లాలు వదిలేసి ఒక తాటిపై వస్తే దోపిడి వర్గాల రాజ్యాన్ని కూల్చవచ్చు అన్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం రోజురోజుకు పేట్రేగిపోతుందని అధికారం ఓట్ల కోసం బిజెపి మతోన్మాద ఎజెండా ఎంచుకొని ప్రజలకు మధ్య చిచ్చు పెట్టదు అధికారాలను కోసం పాకులాడుతుందని దేశ యువత ప్రజాస్వామ్య వాదులు ఆలోచించి బిజెపి చేసే కుట్రలను తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం మహాసభలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించబోతున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బోడ సుదర్శన్, బండి జంగమ్మ, చేడే చంద్రయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్ రెడ్డి, బోలోగాని సత్యనారాయణ కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, ఎండీ ఇమ్రాన్, బచ్చనగోని గాలయ్య, ఉప్పల ముత్యాలు, చెక్క వెంకటేష్, కుసుమని హరిచంద్ర, ఏశాల అశోక్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశికంటి లక్ష్మీ నరసయ్య, స్వాతంత్ర సమరయోధులు బత్తిని యాదగిరి, వలిగొండ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎలగందుల అంజయ్య, పోలేపాక యాదయ్య, నాయకులు పులిపలుపుల మల్లేష్, పట్టణ కార్యదర్శి సల్వార్థి రవీందర్, సుద్దాల సాయికుమార్, బోడిగే సుదర్శన్, బోడ సునీత, మారోజు నరసింహ చారి పాల్గొన్నారు.



## గొర్రెల మేకలకు సీజన్‌లో వచ్చే వ్యాధులకు మందులు పంపిణీ చేయాలి

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** గొర్రెల మేకలకు సీజన్ల వారిగా వచ్చే వ్యాధులకు వెంటనే మెట్టల మందులు మరియు సీజన్ వారీగా వచ్చే మూతి వాపు పురురోగం టీకాలు ఇవ్వాలని జిల్లా గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేశబోయిన సూర్యనారాయణ అన్నారు. మంగళవారం గొర్రెల మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జెడికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామలలో గొర్రెల మేకలకు సంవత్సరానికి మూడుసార్లు నట్టల మందు వేసేవారు కానీ రెండు సంవత్సరాల నుంచి ఎక్కడ కూడా గొర్రెలకు నట్టల నివారణ మందులు వేయడం లేదని,గొర్రెల ఎదుగుదల లేదు సీజన్ వారీగా వచ్చే వ్యాధులకు ముందుగానే రోగ నివారణ మందులు అమ్మ తల్లికి సొమ్ము వ్యాధికి చిటిక రోగం వ్యాధులకు పశువుల దావకల్లో మందులు రావడం లేదు ప్రైవేటు మెడికల్ షాప్ లకు వేల రూపాయలు ఖర్చు చేసి గొర్రెల కాపరులు నష్టపోతున్నట్లు తెలిపారు. ఆ మందులలో నాణ్యత కూడా లేదని,వెంటనే పశువుల దావకాలలో మందులు పంపిణీ చేయాలన్నారు. అలాగే గొర్రెలు అత్యవసరంగా యాక్సిడెంట్లో,పెద్ద రోగాలకు చనిపోతే బీమా సౌకర్యం కల్పించాలని,గ్రామాల సొసైటీలకు ఏకకాలంలో గవర్నమెంట్ ఎలక్షన్ నిర్వహించాలన్నారు. సబ్సిడీలరుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జల్లి నరసింహ, ప్రధాన కార్యదర్శి సోము రమేష్ యాదవ్,హక్కుల విద్యావంతుల జిల్లా అధ్యక్షులు కొత్తపెల్లి ఆనంద్ యాదవ్,మాజీ అధ్యక్షులు ఊదరి నరసింహ,పాక జమ్మయ్య,పాక గోపాల్,తదితరులు పాల్గొన్నారు.



## టిఎస్ మోడల్ స్కూల్‌లో అగ్నిమాపక, భద్రత కార్యక్రమం

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్ :** సిఐఎస్ఎఫ్ యూనిట్ బిడిఎల్ భానూర్ ఫైర్ వింగ్, బిడిఎల్ మేనేజ్‌మెంట్ సమన్వయంతో యువతలో అగ్నిమాపక భద్రత, విపత్తు నిర్వహణ గురించి అవగాహన కల్పించడానికి శంకర్ పల్లిలో తెలంగాణ మోడల్ పాఠశాల లో శిక్షణ కార్యక్రమం నిర్వహించబడం జరిగింది. డైరెక్టర్ జనరల్, డైరెక్టరేట్ జనరల్ సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ) సూచనల మేరకు సిఐఎస్ఎఫ్ ఫైర్ వింగ్ భానూర్ మంగళవారం రోజు బిడిఎల్ భానూర్ మేనేజ్‌మెంట్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్ కిషన్ సమన్వయంతో రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో అగ్నిమాపక భద్రత, విపత్తు నిర్వహణ తరలింపు డ్రిల్ నిర్వహించబడింది. ఈ సందర్భంగా డిప్యూటీ కమాండెంట్/సిఐఎస్ఎఫ్ సి శ్రీరాం తేజస్వి, అసిస్టెంట్ కమాండెంట్/ఫైర్, అర్షద్ అలీ ఖాన్, ఆయన బృందం మొత్తం ఇతర విద్యార్థులకు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి సునీతకు, ఉపాధ్యాయులకు పైన పేర్కొన్న అంశంపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అద్భుతమైన శిక్షణను అభినందించారని, నిర్వహించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. పాఠశాలకు ముందు, శిక్షణ సమయంలో, విద్యార్థులకు వివిధ రకాల విపత్తుల నుండి తమను తాము అలాగే ఇతరులను రక్షించుకునే నైపుణ్యాలను నేర్పించారు. వివిధ పరిస్థితులలో విద్యార్థులు మనుగడ సాగించడానికి తరలింపు కసరత్తులు కూడా నిర్వహించబడ్డాయి.

## తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాలలో స్పాట్ కౌన్సిలింగ్

### డిసిఓ సాయిలత



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** 2025 - 26 సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరానికి స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిం చడం జరుగుతుందని డి సి ఓ సాయి లత ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల కళాశాలలో పరిమితి ఖాళీలను భర్తీ చేయుటకు ఎంపీసీ, బైపిసి గ్రూపులకు స్పాట్ కౌన్సిలింగ్ ఈనెల 31వ తేదీన సంబంధిత కళాశాలల వద్ద నిర్వహిం చడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒకటి గంటలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవు అన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి కౌన్సిలింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు.

**ఎంపిక ప్రమాణాలు**

2025 సంవత్సరంలో ఎస్ఎస్సి/ సీబీఎస్సీ/ ఐసిఎస్ఈ నుండి( తెలుగు లేదా ఆంగ్ల మాధ్యమం) ఒకేసారి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఎంపీసీ గ్రూప్ కి గణితం, సైన్స్ సబ్జెక్టుల మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. బైపీసీ గ్రూప్ కి సైన్స్ గణితం మార్పులు ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఏ కళాశాలలో అయినా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జాతి, ఆదాయ, జనన ధ్రువీకరణ పత్రాలు( 2024 సంవత్సరం మీసేవ నుండి జారీ చేయబడినవి) తప్పనిసరిగా సమర్పించాలన్నారు. పట్టణ ప్రాంతం వారికి రెండు లక్షల లోపు, గ్రామీణ ప్రాంతం వారికి 1,50,000 లోపు ఆదాయ పరిమితి ఉండాలన్నారు. కౌన్సెలిం గ్కు వచ్చేటప్పుడు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు జిరాక్స్ సెట్లు, మూడు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలన్నారు.



## అంగన్వాడిల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

### మండల ప్రత్యేక అధికారి జగన్నాథ రావు

**వలిగొండ రాజముద్ర న్యూస్:** అంగన్వాడి సెంటర్ లో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని మండల ప్రత్యేక అధికారి జగన్నాథ రావు అంగన్వాడీ టీచర్ ను ఆదేశించారు. మంగళవారం రోజున వలిగొండ మండలంలోని పులిగిల్ల అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి జగన్నాథ రావు మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్‌లో ఉన్న పిల్లలు, తల్లులు, బాలింతలకు అందుతున్న అంగన్వాడీ సేవల గురించి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పిల్లల పెరుగుదల పర్యవేక్షణను క్రమంగా చేపట్టాలని నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి తొందరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. అదేవిధంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలను సైతం ఆయన సందర్శించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆయన ఉపాధ్యాయులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా ఏఈ రమ్య, గ్రామ ప్రత్యేక అధికారి సంధ్య, పంచాయతీ కార్యదర్శి జోగు సైదులు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ అంగన్వాడి టీచర్ బందారపు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదం

- వారం రోజుల్లో 350 మందిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు.
- పట్టుబడ్డ వారిలో 8 మందికి ఒక్కరోజు జైలు.ఇతరులకు జరిమానా.
- సూర్యాపేట ఎస్పి కె.నరసింహా



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు, ఇతరులను ప్రమాదంలో పడేస్తున్నారు అని, ప్రమాదాల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రతి రోజూ వాహనా ల తనిఖీలు నిర్వహిస్తున్నాం అని ఎస్పి నరసింహ ఐపిఎస్ తెలిపినారు.గత వారం రోజులుగా 350 మంది పై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేశాను అన్నారు, జరి మానా మార్పు కోసమే అన్నారు.ఎవ్వరూ కూడా మద్యం మత్తులో వాహనాలు తోల వద్దు అని ఎస్పి కోరారు.మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పలుమార్లు పట్టు బడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు అని ఎస్పి హెచ్చరించారు. రోడ్లపై ప్ర యాణ సమయంలో ముందు జాగ్రత్తలతో ప్రమాదాలు నివారించవచ్చు అని తెలిపినారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

### ఏడుగురికి జరిమానా : సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడు తూ జిల్లా ఎస్పీ, నరసింహ,ఐ పి ఎస్ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతంలో వాహనాల తనిఖీలు చేపట్టారు.ఇందులో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ ఎనిమిది మంది (08) పట్టుబడినట్లు ఎస్సై సాయిరాం తెలిపారు.పట్టుబడిన వారిని 29 న కోర్టులో హాజరు పరచగా సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బి.వి.రమణ ఒక్కరికి ఒక రోజు జైలు శిక్ష.2,000 జరిమానా అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన మిగతా ఏడుగురికి (07) కలిపి రూ.6,500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పినట్లు ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడే వారికి చలానాలు విధించడంతో పాటు కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



## బ్యాంక్ స్ట్రీట్ ఉప పోస్ట్ ఆఫీస్‌ను హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో విలీనం చేయొద్దు

### బిఆర్ఎస్ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆకుల లవకుశ

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 25వ వార్డులో కొనసాగుతున్న బ్యాంక్ స్ట్రీట్ ఉప పోస్ట్ ఆఫీస్ ను హెడ్ పోస్ట్ ఆఫీస్ లో విలీనం చేయాలనుకునే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని బిఆర్ఎస్ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆకుల లవకుశ డిమాండ్ చేశారు.పెన్షన్ దారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బ్యాంక్ స్ట్రీట్ ఉప తపాల కార్యాలయం ముందు పెన్షన్ దారులతో కలసి ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఈ పోస్ట్ ఆఫీస్ కింద 3వేల మంది పెన్షన్ దారులతో పాటు 3వేల మంది ఖాతాదారులు ఉన్నారని దీన్ని హెడ్ పోస్ట్ ఆఫీస్ లో విలీనం చేయడంతో వృద్ధులు, వికలాంగులు,పెన్షన్లు తీసుకునేందుకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఇదే పోస్ట్ ఆఫీస్ ని గతంలో చర్చి కాంపౌండ్ ప్రాంతంలో నిర్వహించగా దూర భారం కావడంతో తాము అధికారులకు విన్నవించిన వెంటనే 25వ వార్డులో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఇటీవల పోస్ట్ ఆఫీస్ విజిట్ కు వచ్చిన పిజిఎం ఇక్కడ పోస్ట్ ఆఫీస్ లో ఖాతాలు లేవని కేవలం పెన్షన్ల కోసమే కొనసాగుతుందని చెబుతూ దీన్ని హెడ్ పోస్ట్ ఆఫీస్ లో విలీనం చేయాలని రిపోర్టు ఇవ్వడం సరికాదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ దారుల జీవితాలతో చెలగాటాలాడుతూ ఉప పోస్ట్ ఆఫీస్ లను ఎత్తివేయాలని చూడడం దారుణం అన్నారు. పేదలు,వృద్ధులు, వికలాంగులను దృష్టిలో ఉంచుకొని బ్యాంకు స్ట్రీట్ పోస్ట్ ఆఫీస్ ను ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వృద్ధులు, వికలాంగులు,పెన్షన్ దారులతో కలిసి పెద్ద ఎత్తున పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు అర్వపల్లి లింగయ్య,బైరు వెంకన్న ముదిరాజ్, వృద్ధులు, వికలాంగులు,పెన్షన్ దారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించడం ప్రజాప్రతినిధుల లక్ష్యం

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క



**తాండూర్, రాజముద్ర న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కరించడం ప్రజా ప్రతినిధి లక్షణమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం తాండూర్ నియోజకవర్గంలో పలు సంక్షేమ అభివృద్ధికి శంకుస్థాపనలు, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ఐటీ భారీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, తాండూరు శాసనసభ్యులు భుయ్యాని మనోహర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందనెల్లి జిపిఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన సభలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ... ప్రజా సమస్యలు, బాధలను అర్థం చేసుకొని ప్రజా పాలనను చేపట్టడం జరుగుతుందన్నారు. గత పది సంవత్సరాల్లో చేపట్టని పనులన్నింటిని పెద్ద మొత్తంలో నిధులను కేటాయించి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో అధిక నిధులను కేటాయిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన అన్నారు. రాష్ట్రంలో రేషన్ కార్డు లేని అర్హులైన పేదవారికి కార్డులను అందిస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్రంలో కోటి 20 లక్షల కుటుంబాలకు గాను 95 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులను అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇండ్లు లేని ప్రతి పేదవాడికి ఇంటి నిర్మాణాల నిమిత్తం ప్రతి నియోజకవర్గానికి మొదటి విడతగా 3500 మంజూరు చేస్తూ, ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుడికి 5 లక్షల చొప్పున నగదును జమ చేయడం జరుగుతుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి పేదవాడికి వైద్య సదుపాయి నిమిత్తం ఆరోగ్యశ్రీ కింద 10 లక్షల రూపాయలను అందించడం జరుగుతుంది ఆయన అన్నారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబాల పిల్లలు ఉన్నత చదువులు చదువుకునేందుకు వీలుగా 25 ఎకరాల్లో 200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇలాంటి పాఠశాలలు భవిష్యత్తు తరాలకు ఎంతగానో దోదపడుతుందని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యా వ్యవస్థను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆయన అన్నారు. జనాభాలో సగభాగమైన మహిళల ఆర్థిక అభివృద్ధికి వడ్డీ లేని రుణాలను అందజేయడం జరుగుతుందని, ఒక సంవత్సరంలోనే 21 వేల కోట్ల రుణాలను అందించిన ఘనత ప్రజాపాల ప్రభుత్వందని ఆయన తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ ధ్యేయంగా మహిళలకు ఆర్టీసీల్లో బస్సులను అద్దెకివ్వడం, సోలార్ పవర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం మహిళలకు తోడ్పాటు అందిస్తుందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతుల పక్షపాతిగా రైతుల బాధలను తెలుసుకున్న ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలతో ముందుకు వెళుతుందని ఆయన అన్నారు. వసతి గృహాల్లో మెస్ చార్జీలను పెంచి నాణ్యమైన భోజనాన్ని అందించడంతో పాటు వసతి గృహాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. లో వోల్టేజ్ ని అధిగమించేందుకు గాను రాష్ట్రంలో అవసరమున్న ప్రాంతంలో విద్యుత్తు సబ్ స్టేషన్లు, ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జనాభా ప్రాతిపదికన బహుజనుల రిజర్వేషన్ 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వ తీర్మానాన్ని కేంద్రానికి సమర్పించినట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఆమోదం తెలుపుతుందని ఆశిస్తున్నామని మంత్రి అన్నారు. శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చాక ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. గత ముఖ్యమంత్రి పదేళ్ళలో ఎనిమిది లక్షల కోట్ల అప్పులు చేశారని, ఇప్పుడు దానికి నెలకు ఆరు వేల 500 కోట్లు వడ్డీ చెల్లిస్తున్నట్లు ఆయన తెలిపారు. అప్పులకు వాయిదాలు, వడ్డీలు కడ్తూనే మరోవైపు పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల లోపు కరంటు వాడుకునే పేదల కుటుంబాలకు ఉచిత కరెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుంచి 10 లక్షలకు పెంపు, 500 రూపాయలకే సబ్సిడీ గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు మంజూరు ఇలా పేదలకు మేలు జరిగే పథకాలను అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే జిల్లాలో పంచాయితీ రాజ్, ఆర్ అండ్ బి రోడ్ల అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు మంజూరు కాగా పనులు వేగంగా జరుగుతున్నాయి. అదేవిధంగా కోట్ పల్లి ప్రాజెక్టు అభివృద్ధి కోసం 90 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయనీ అని తెలిపారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ... సంక్షేమ కార్యక్రమాలు పొందేందుకు రేషన్ కార్డు ఎంతగానో దోదపడుతుందన్నారు. రేషన్ కార్డులు ఉన్నవారికి సన్న రకం బియ్యం పొందుతారని, దీనివల్ల ఎంతమంది పేదలు లబ్ధి పొందుతారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రతి అరుడైన పేదవారికి ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో 75 వేల మందికి ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. 9 రోజుల్లో 9 వేల కోట్ల రైతు రుణమాఫీని చేయడం జరిగిందని ఆయన తెలిపారు. వికారాబాద్ నుండి తాండూర్ వరకు 63 కోట్ల వ్యయంతో రోడ్ల నిర్మాణాలకు నాంది పలకడం జరిగిందని మంత్రి సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూనే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం కొత్త రేషన్ కార్డులు పంపిణీ ఆయన తెలిపారు. మహిళా సంక్షేమం కోసం ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్ లు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. వికారాబాద్ జిల్లాలో కొత్తగా 22,503 రేషన్ కార్డులు ఇస్తూ 71 వేల మందికి లబ్ధి చేకూర్చడం జరుగుతుందన్నారు. తాండూర్ నియోజకవర్గం లో కొత్తగా 7,043 కార్డులు మంజూరు కాగా దీనితో 22,292 మంది కి లబ్ధి చేకూరుతుంది. ఇలా బషీరాబాద్ లో 706, పెద్దెముల్ లో 1939, తాండూరు మండలం, మున్సిపల్ లో 3315,యాలాల్ లో 1083 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత, డిసిసిబి చైర్మన్ సత్తయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, జిల్లా అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వైద్యుడి నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి



**ఉత్తరప్రదేశ్ :** ఓ వైద్యుడు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల నిండు ప్రాణం పోయిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో చోటుచేసుకుంది. మేరఠ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రక్తమోడుతున్న సునీల్ కుమార్ అనే వ్యక్తిని అతడి బంధువులు స్థానికంగా ఉన్న లాలా లజపతి రాయ్ మెమోరియల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రికి తీసుకువచ్చిన వెంటనే అక్కడి విధుల్లో ఉన్న డాక్టర్ వైద్యం చేయకుండా నిర్లక్ష్యంగా ఏసీ వేసుకొని మరీ నిద్రపో వడం వల్ల బాధితుడు ప్రాణాలు కోల్పోయినట్లు అతడి బంధు వులు ఆరోపించారు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం అర్ధరాత్రి మేరఠ్‌లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో సునీల్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ విధుల్లో ఉన్న జూనియర్ రెసిడెంట్ డాక్టర్ భూపేశ్ కుమార్ రాయ్ వారిని పట్టించుకోకుండా ఏసీ వేసుకొని నిద్ర పోయాడు. పరిస్థితి చేయి దాటిపోతోందని.. వైద్యం చేయాలని ఎంతగా ప్రాధేయపడినప్పటికీ అతడు నిద్ర లేవలేదు. సహాయం కోసం ఇతర వైద్య సిబ్బందిని సంప్రదించినా ఎవరూ స్పందించలేదు. దీంతో తీవ్రంగా గాయపడిన సునీల్‌ను గంటలతరబడి ఎమర్జెన్సీ వార్డులో స్ట్రెచర్‌పై వదిలివేయడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అతడు మరణించాడు. బాధితుడికి వైద్యం చేయాలని అతడి కుటుంబసభ్యులు డాక్టర్‌ను ఎన్నిసార్లు కోరినప్పటికీ పట్టించుకోకుండా అక్కడ ఉన్న టేబుల్‌పై కాళ్లు పెట్టుకొని అతడు నిద్రపోతున్న వీడియో సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అది వైరల్‌గా మారింది. వెంటనే స్పందించిన లాలా లజపతిరాయ్ మెమోరియల్ మెడికల్ కాలేజీ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ జూనియర్ రెసిడెంట్ డాక్టర్ భూపేశ్ కుమార్ రాయ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయడానికి ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటుచేశామన్నారు.




## ప్రతి ఇంటి ముందూ శుభ్రతే లక్ష్యం

### మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్:** ప్రతి పౌరుడు తన ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో ముందుండాలని మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక 1వ వార్డులో 100 రోజుల పట్టణ ప్రణాళికలో భాగంగా నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వం పట్టణాలను మెరుగ్గా తీర్చిదిద్దేందుకు ముందుకొస్తే, ప్రజలు కూడా సమానంగా స్పందించి సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. కాలనీల్లో తడి,పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు.మురుగు కాలువల నియమిత నిర్వహణ, దోమల నివారణ చర్యలపై ఆయన ప్రత్యేకంగా వివరించారు.ప్రజలతో మున్సిపల్ సిబ్బంది నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకొని ఆయన స్పందించారు."పట్టణ శుభ్రత సామూహిక బాధ్యత అన్నారు. ప్రజలు మాకు తోడుగా ఉంటే అభివృద్ధి వేగవంతమవుతుందని కమిషనర్ హన్మంతరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వేములకొండ పద్మ , మున్సిపల్ అధికారులు డి.ఇ.సత్యారావు సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ ,ఏ.ఇ తిరుమలయ్య ,ఆర్ ఐ లు గౌసుద్దీన్,అజీముద్దీన్ ,వార్డు అధికారి నరేష్ ,టీఎంసీ శ్వేత,ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్ శివ ప్రసాద్ సిబ్బంది,హెల్త్ వర్కర్లు, కాలనీ మహిళలు,స్థానిక యువత,విద్యార్థులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం, నూతన రేషన్ కార్డుల ద్వారా ఆహార భద్రత

- సన్న బియ్యం, నూతన రేషన్ కార్డుల పంపిణి గేమ్ చెంజర్స్ గా అభివర్ణన
- 396 కోట్ల రూపాయలతో 10,000 ఎకరాలకి నీరు అందించే రాజీవ్ గాంధీ దొండపాడు-2 లిఫ్ట్ కి క్యాబి నెట్ ఆమోదం
- హుజూర్‌నగర్ నియోజకవర్గంని రాష్టంలోనే నెంబర్ 1 గా చేస్తా
- రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ ఇండ్లు, రేషన్ కార్డులు
- రాష్ట్ర ఎస్ సి, ఎస్ టి, మైనార్టీ, వయో వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్




**సూర్యాపేట, జూలై 29, రాజముద్ర ప్రతినిధి :** పేదవారికి కడుపు నింపి ఆహార భద్రత కల్పించే సన్నబియ్యం, నూతన రేషన్ కార్డులు పంపిణి కార్యక్రమాలన్ని మించిన సంక్షేమ పథకాలు భారత దేశ చరిత్రలో లేవన్ని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హుజూర్ నగర్ పట్టణం కౌండిన్య పంక్షన్ హాల్ నందు మంగళవారం హుజూర్ నగర్ నియోజకవర్గంలో లబ్ధిదారులకి నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎస్ సి,ఎస్ టి,మైనారిటీ, దివ్యాంగుల,వయో వృద్ధుల సంక్షేమ శాఖ, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ ,జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ లతో కలిసి రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్బంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలోనే హుజూర్నగర్ నుండి సన్న బియ్యం పంపిణి చేసిన ఉగాది పర్వదినం నిలిచి పోతుందని,అలాగే తిరుమలగిరి నుండి నూతన రేషన్ కార్డులు పంపిణి సూర్యాపేట జిల్లా నుండి గౌరవ ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సూర్యాపేట జిల్లా నుండి ప్రారంభించిన రెండు పథకాలు చరిత్ర లో గేమ్ చెంజర్స్ గా నిల్చిపోతాయని అన్నారు. గతంలో 10,600 కోట్లు ఖర్చు పెట్టి 89.95 లక్షల కార్డులకి 2.80 కోట్ల మందికి దొడ్డు బియ్యం పంపిణి చేస్తే ప్రజాధనం దుర్వినియోగం అయిందని, అందుకే పేద వారి కడుపు నింపేలా 13,000 కోట్లతో 97.90 లక్షల కార్డులకి 3.10 కోట్ల మందికి కేజీ 57 రూపాయలు ఖర్చు పెట్టి ప్రతి ఒక్కరికి 6 కేజీల సన్న బియ్యం ఉచితంగా పంపిణి చేస్తున్నామనిఅన్నారు. రైతులకి సన్న వడ్లు పండించేందుకు బోనస్ 500 ఇస్తున్నామని, సన్న వడ్లు సేకరించి మిల్లింగ్ చేసి దారిద్ర్య రేఖకి దిగువన ఉన్న వారు కడుపు నిండా తినేలా రాజకీయాలకి అతీతంగా నూతన కార్డులు,సన్న బియ్యం పంపిణి చేస్తున్నామని తెలిపారు. చింతలపాలెం మండలంలో గతంలో 12,000 కార్డులుంటే 1116 కొత్తగా ఇచ్చామని, గరిడేపల్లి మండలంలో పాతవి 17000 ఉంటే కొత్తవి 2446,హుజూర్నగర్ లో పాతవి 18000, కొత్తవి 2300, మట్టంపల్లి మండలంలో పాతవి 13,800 ఉంటే కొత్తవి 1400,మేళ్లచెర్వులో పాతవి 11,000 ఉంటే కొత్తగా 1200,నేరేడుచర్ల లో పాతవి 11,000 ఉంటే కొత్తగా 1700 అలాగే పాలకీడులో 7000 పాతవి ఉంటే 812 కొత్తవి మొత్తం 11,000 కార్డులు నూతనంగా మంజూరు చేశామని దీని ద్వారా 52,000 మందికి సన్న బియ్యం తినే హక్కు కల్పించామని తెలిపారు. 18 సంవత్సరాల తర్వాత జూలై మాసంలో సాగు నీరు వదలటం జరుగుతుందని నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ శంకుస్థాపన చేసిన నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ఇందిరా గాంధీ ప్రారంభించారని నేటికీ చెక్కు చెదరలేదు అని తెలిపారు. 396 కోట్ల రూపాయలతో 10,000 ఎకరాలకి నీరు అందించే రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ దొండపాడు 2 కి క్యాబినెట్ ఆమోదం తెలపటం జరిగిందని తెలిపారు. హుజూర్ నగర్ నియోజకవర్గం ని రాష్ట్రములోనే నెంబర్ 1 గా చేస్తానని మంత్రి ఈ సందర్బంగా తెలిపారు. ఇంచార్జి మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత పదేళ్లు ఒక్క కార్డు, ఇల్లులు ఇవ్వలేదని ఇందిరమ్మ రాజ్యములో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని, 200 యూనిట్ల కరెంట్, ఉచిత బస్సు, ఉద్యోగాలు,ఇలాంటి మంచి సంక్షేమ పథకాలు ఇస్తున్న ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదలు ఉండాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ల కృషితో ప్రతి పేదవారికి ఆహార భద్రత కల్పించే సన్న బియ్యం,నూతన రేషన్ కార్డులు పంపిణి ప్రారంభించటం మన అదృష్టం అని అన్నారు. కార్డులు రాని వారు ఎవరు అందిలోన పడాల్సిన అవసరం లేదు అని అర్హులైన అందరు రేషన్ కార్డులకి దరఖాస్తు చేసుకోవచ్చు అని కలెక్టర్ ఈ సందర్బంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ,సివిల్ సప్లై ప్రిన్సిపల్ సెక్రటరీ డి ఎస్ చౌహన్,జిల్లా ఎస్పి కే నరసింహ,అదనపు కలెక్టర్ పి రాంబాబు,ఆర్డీఓ శ్రీనివాసులు, డి ఎస్ ఓ మోహన్ బాబు,తహసీల్దార్ లు,అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఆసియా కప్

## భారత్- పాకిస్థాన్ మ్యాచ్ రద్దయ్యే అవకాశం లేదు!

ఆసియా కప్‌లో భాగంగా సెప్టెంబర్ 14న గ్రూప్ దశలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య మ్యాచ్ జరగనుంది. అయితే ఈ షెడ్యూలు విడుదలైన తర్వాత నుంచి సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం, పాకిస్థాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో టీమ్ఇండియా.. ఆ దేశంతో క్రికెట్ మ్యాచ్ ఆడకూడదంటూ పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. అయితే ఈ మ్యాచ్ రద్దయ్యే అవకాశాలు లేవని తెలుస్తోంది. ఆసియా కప్‌లో మొత్తంగా టీమ్ఇండియా గరిష్ఠంగా మూడుసార్లు పాకిస్థాన్‌తో తలపడే అవకాశం ఉంది. 'ఇది ద్వైపాక్షిక పోటీ కాదు. బహుళ దేశాలు పాల్గొనే టోర్నమెంట్లో జరిగే మ్యాచ్. పాకిస్థాన్‌తో భారత్ మ్యాచ్‌లు ఆడకుంటే.. దాయాది జట్టుకు భారీ ప్రయోజనం కలుగుతుంది. కాబట్టి అది సరికాదు' అని అధికారిక వర్గాలు అంటున్నాయి. అలాగే ఈవిషయమై క్రీడా మంత్రిత్వశాఖ అధికారులు కూడా మాట్లాడారు. 'ప్రస్తుతానికి, జాతీయ క్రీడా పాలన బిల్లు ఇంకా ఆమోదం పొందలేదు. కాబట్టి.. బీసీసీఐ క్రీడా మంత్రిత్వ శాఖ పరిధిలోకి రాదు. అయితే బీసీసీఐ ప్రజల మనోభావాల మీద ఎలా స్పందిస్తుందో వేచి చూద్దాం' అని వారు అన్నారు. అయితే పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక క్రీడా సంబంధాలకు మాత్రం తావులేదని క్రీడా మంత్రిత్వ శాఖ పేర్కొంది. డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) కేజేఎస్ ధిల్లాన్, పాకిస్థాన్‌తో క్రికెట్ సంబంధాలను పూర్తిగా బహిష్కరించాలని పిలుపునిచ్చిన ప్రముఖులలో ఒకరు. బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ ఉగ్రవాదాన్ని ఖండిస్తూ, క్రీడలు కొనసాగాలని పేర్కొన్నారు. అయితే, ఎనిమిది దేశాల జట్లు పాల్గొనే ఆసియా కప్ ఐసీసీ ఈవెంట్ కాదు. అలాగే.. ప్రస్తుతం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చీఫ్ మోహ్సిన్ నఖ్వీనే ఆసియా క్రికెట్ కౌన్సిల్‌కు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నాడు. 2008 ముంబయి ఉగ్రదాడుల వెనక పాకిస్థాన్ హస్తం ఉన్న నేపథ్యంలో.. అప్పటినుంచి భారత్ ఆ దేశంతో ద్వైపాక్షిక సిరీస్‌ల్లో పాల్గొనడం లేదు. కానీ వరల్డ్‌కప్, ఛాంపియన్స్ ట్రోఫీ వంటి ఐసీసీ ఈవెంట్లలో ఇరు దేశాల జట్లు తటస్థ వేదికల మీదే తలపడుతున్నాయి.

## శుభ్‌మన్ గిల్ మరోసారి

# తానేంటో నిరూపించుకున్నాడు

### రవిచంద్రన్ అశ్విన్



ఇంగ్లాండ్‌తో మాంచెస్టర్‌లో టీమ్ఇండియాకు జరిగిన నాలుగో టెస్టులో రాణించిన గిల్.. మరోసారి తానేంటో నిరూపించుకున్నాడని అశ్విన్ అన్నాడు. గిల్ తన తప్పుల నుంచి నేర్చుకుంటాడని అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడాడు. లార్డ్స్ టెస్ట్‌లో విఫలం కాగానే శుభ్‌మన్‌గిల్‌ను చాలామంది విమర్శించారు. అతడి బ్యాటింగ్ టెక్నిక్ మీద సందేహాలు వెలిబుచ్చారు. కానీ అతడు మాంచెస్టర్ టెస్ట్‌లో తన ఇన్నింగ్స్ ద్వారా వాటన్నింటినీ పటాపంచలు చేశాడని అశ్విన్ కొనియాడాడు. 'శుభ్‌మన్ గిల్ అద్భుతమైన సెంచరీ చేసి తానేంటో మరోసారి నిరూపించుకున్నాడు. అతడు తన టెక్నిక్ మీద కసరత్తు చేశాడు. కానీ అతడు కెప్టెన్‌గా సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోలేదు. వాషింగ్టన్ సుందర్‌ను ఆలస్యంగా తీసుకురావడం చాలా పెద్ద తప్పిదం. కానీ ఇలాంటివి జరుగుతుంటాయి. గిల్ ఇంకా యువకెప్టెనే కాబట్టి.. అతడు తన తప్పుల నుంచే నేర్చుకుంటాడు. అయితే అతడు చాలా త్వరగా నేర్చుకుంటాడని నేను ఆశిస్తున్నా' అని అశ్విన్ అన్నాడు. బ్యాటింగ్‌లో గిల్ విజయాల గురించి కూడా అశ్విన్ మాట్లాడాడు. 'శుభ్‌మన్ గిల్ బ్యాటర్‌గా అద్భుతంగా రాణిస్తున్నాడు. బర్మింగ్‌హామ్, హెడింగ్లీలో అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. లార్డ్స్‌లో టీమ్ఇండియా టెస్ట్ మ్యాచ్ ఓడిపోగానే చాలామంది గిల్ బ్యాటింగ్‌ను ప్రశ్నించారు. కానీ అతడు తిరిగి పుంజుకున్నాడు' అని అశ్విన్ విశ్లేషించాడు. అలాగే రవిచంద్రన్ అశ్విన్ టీమ్ఇండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్‌కు ఓ సలహా ఇచ్చాడు. 'దయచేసి ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకోండి. ఎందుకంటే టెస్ట్ మ్యాచ్‌లు బ్యాటింగ్ డెప్త్ ద్వారా గెలవలేం. డ్రా మాత్రం చేసుకోవచ్చు. వికెట్లు తీయగల నేర్పున్న బౌలర్లు టీమ్‌లో ఉంటేనే టెస్ట్ మ్యాచ్‌లను గెలవగలం' అని రవిచంద్రన్ అశ్విన్ కుండబద్దలు కొట్టాడు.

## బ్యాటింగ్ విభాగం బాగుంది.. బౌలింగ్ దళం మెరుగుపడాలి

### అజింక్య రహానే

తెందూల్కర్ - అండర్సన్ ట్రోఫీలో భాగంగా టీమ్ఇండియా, ఇంగ్లాండ్‌ల మధ్య జులై 31 నుంచి చివరిదైన అయిదో టెస్ట్ మ్యాచ్ జరగనుంది. ఈ పోరుకు ముందు అజింక్య రహానే టీమ్ఇండియా లోపాలను సవరించుకోవాలని కీలకమైన సూచనలు చేశాడు. భారత జట్టు బ్యాటింగ్ విభాగం అద్భుతంగా ఉన్నప్పటికీ, బౌలింగ్ దళమే సమష్టిగా రాణించాల్సిన అవసరం ఉందన్నాడు. ఈ మేరకు తన యూట్యూబ్ ఛానల్‌లో అతడు వ్యాఖ్యానించాడు. 'టీమ్ఇండియా బాగా ఆడుతోంది. ముఖ్యంగా బ్యాటింగ్ విభాగం అద్భుతంగా రాణిస్తోంది. బౌలింగ్ దళంతోనే కాస్త ఇబ్బంది ఎదురవుతోంది. ఒకరిద్దరు బౌలర్లు చక్కగా బౌలింగ్ చేస్తున్నారు. కానీ వారికి ఇతర బౌలర్ల నుంచి సరైన మద్దతు లభించడం లేదు' అని అజింక్య రహానే వాపోయాడు. ఈ సిరీస్‌లో టీమ్ఇండియా బౌలర్లు.. పరుగులు చేయకుండా ఇంగ్లాండ్ బ్యాటర్లకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ముఖ్యంగా మాంచెస్టర్ టెస్ట్‌లో ఇంగ్లాండ్ బ్యాటర్లు ఒక ఇన్నింగ్స్‌లోనే ఏకంగా 669 పరుగులు చేశారు. ఒకవేళ ఈ మ్యాచ్.. రెండో ఇన్నింగ్స్‌లో శుభ్‌మన్ గిల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ సెంచరీలు చేసి ఆదుకోకపోయి ఉంటే.. టీమ్ఇండియా ఓటమిపాలై ఉండేది. నితీశ్‌కుమార్ రెడ్డి, ఆకాశ్ దీప్ గాయాల పాలవడంతో మాంచెస్టర్ టెస్ట్‌లో టీమ్ఇండియా బౌలింగ్ రిజర్వ్ బలహీనంగా మారింది. లార్డ్స్ టెస్ట్‌లో ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ బంతితో ఆకట్టుకున్నాడు. అలాగే బర్మింగ్‌హామ్ టెస్ట్‌లో రాణించిన ఆకాశ్‌దీప్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు.




## మరింత వేగంగా ఐటీఆర్ రిఫండ్‌లు

ఆదాయపన్ను చెల్లింపుదారులకు గుడ్‌న్యూస్! ఐటీ రిఫండ్‌లు వేగం పుంజుకొంటున్నాయి. దీంతో, ఐటీ రిటర్నులు దాఖలు చేసి రిఫండ్‌ల కోసం నెలలు, రోజుల తరబడి ఎదురుచూపులు ఇక గతమే. ఎందుకంటే ఇప్పుడు అత్యంత వేగంగా రిఫండ్‌లు జారీ అవుతున్నాయి. ఈ ఏడాది ఐటీఆర్ 5 దాఖలు చేసిన పలువురు పన్ను చెల్లింపుదారులు తాము ఐటీ రిటర్నులు ఫైల్ చేసిన కేవలం 4 గంటల వ్యవధిలోనే రిఫండ్‌లు పొందినట్లు చెబుతున్నారు. ఈ పరిణామం ఐటీఆర్ ప్రాసెసింగ్ విషయంలో పెను మార్పేనని చెప్పొచ్చు. 12 ఏళ్ల క్రితం ఐటీ రిఫండ్‌లు పొందడానికి 90 రోజుల కంటే ఎక్కువ సమయం పట్టేది. కానీ, ఇప్పుడు డిజిటల్ రంగంలో మార్పులతో ఐటీఆర్‌ల ప్రాసెసింగ్ ప్రక్రియ వేగవంతం కావడంతో ఆ సమయం రోజుల నుంచి గంటలకు తగ్గతుండటం పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం కలిగించే అంశం. నోయిడాకు చెందిన అరుణ్ ప్రకాశ్ అనే వ్యక్తి ఐటీశాఖ ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో ఫారం- 1 ద్వారా తన రిటర్న్ దాఖలు చేసిన కేవలం 4 గంటల్లోనే రిఫండ్ పొందినట్లు వెల్లడించారు. "నేను సాయంత్రం 5.30గంటల సమయంలో నా రిటర్న్ దాఖలు చేశా. అదేరోజు రాత్రి 9.02 గంటలకు రిఫండ్ నా బ్యాంకు ఖాతాలో జమ అయింది " అని పేర్కొంటూ సంబంధిత సమయాన్ని సూచించేలా స్క్రీన్‌షాట్‌ను షేర్ చేశారు. అలాగే, పన్నుల రంగంలో నిపుణుడు దీపక్ వర్మ మాట్లాడుతూ.. తన క్లయింట్లలో చాలా మంది ఐటీఆర్ దాఖలు చేసిన అదే రోజు రిఫండ్ అందుకున్నట్లు చెప్పారు. ఇది ఐటీ శాఖ డిజిటల్ సామర్థ్యానికి గొప్ప ఉదాహరణగా పేర్కొన్నారు. అయితే, ఐటీ రిటర్నులు దాఖలు చేసిన వారిలో ఎక్కువ మందికి ఇలా గంటల వ్యవధిలోనే రిఫండ్‌లు వస్తున్నాయా, లేదా? అన్న అంశంపై మాత్రం సమాచారం లేదు.

## లాభాల్లో ముగిసిన సూచీలు



దేశీయ మార్కెట్లు మంగళవారాన్ని లాభాలతో ముగించాయి. వరుసగా మూడురోజులుగా కొనసాగుతోన్న నష్టాలకు నేడు బ్రేక్ పడింది. రియల్టీ, ఫార్మా రంగాలు సూచీలకు అండగా నిలిచాయి. ఈ ఉదయం 80,973.25 వద్ద సెన్సెక్స్ ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,665కు తగ్గి.. చివరకు 446 పాయింట్లు పుంజుకొని 81,328 వద్ద ముగిసింది. నిఫ్టీ 140 పాయింట్ల లాభంతో 24,821 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 15 పైసలు తగ్గి 86.82 గా ముగిసింది. నిఫ్టీ సూచీలో జియో ఫైనాన్షియల్, లార్సెన్, రిలయన్స్, ఆసియన్ పెయింట్స్, ఐషర్ మోటార్స్ రాణించగా.. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టైటాన్ కంపెనీ షేర్లు కుదేలయ్యాయి. ఐటీ, లోహ, రియల్టీ రంగాల్లో కొనుగోళ్లకు మదుపర్లు ఆసక్తి కనబర్చడం ఈ లాభాలకు కారణమైంది. మార్కెట్ అస్థిరతను అంచనా వేసే వీఐఎక్స్ సూచీ 2.9 శాతం క్షీణించింది. యూఎస్ మార్కెట్లు లాభాల్లో ప్రారంభం అవుతాయనే సంకేతాలు మన మార్కెట్లపై ప్రభావం చూపించాయి.

## బీసీసీఐ కార్యాలయం నుంచి

# ఐపీఎల్ జెర్సీల చోరీ




ముంబయి వాంఖడే స్టేడియంలోని బీసీసీఐ కార్యాలయం నుంచి 6.5 లక్షల రూపాయల విలువైన ఐపీఎల్ 2025 జెర్సీలు చోరీకి గురయ్యాయి. నిందితుడైన సెక్యూరిటీగార్డు ఫరూఖ్ అస్లాం ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచా రం. అతడు దాదాపు 261 జెర్సీలను దొంగిలించినట్లు తెలుస్తోంది. ఒక్కోదాని ఖరీదు సుమారు 2,500 రూపాయలు ఉంటుందని అంచనా. ఆన్‌లైన్ జూదానికి బానిసైన సెక్యూరి టీగార్డు ఈ చోరీకి పాల్పడ్డాడని పోలీసుల విచారణలో తేలింది. అయితే జెర్సీలు వేరు వేరు జట్లకు చెందినవి అయిన ప్పటికీ, అవి ఆటగాళ్ల కోసమా.. లేక అభిమానుల కోసమా అనేది కచ్చితంగా తెలియదు. ఆ సెక్యూరిటీ గార్డు తాను దొంగిలించిన జెర్సీలను హరియాణాకు చెందిన ఆన్‌లైన్ డీలర్‌కు విక్రయించాడు. ఈ డీల్ కోసం నిందితుడు, అతణ్ని సోషల్ మీడియా ద్వారా సంప్రదించాడు. ఈ దొంగతనం జూన్ 13న జరిగినప్పటికీ ఆలస్యంగా వెలుగు చూసింది. స్టోర్‌రూమ్‌లో స్టాక్ మిస్సయినట్లుగా ఆడిట్‌లో తేలడంతో ఈ చోరీ ఉదంతం బయటకు వచ్చింది. బీసీసీఐ అధికారులు సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించగా, ఆ సెక్యూరిటీ గార్డు జెర్సీలను ఒక పెట్టెలో పెట్టుకొని వెళ్లిపోయినట్లు గుర్తించారు. ఆ జెర్సీలను తాను కొరియర్ ద్వారా ఆన్‌లైన్ డీలర్‌కు పంపినట్లు నిందితుడు తెలిపాడు. అయితే ఎంత మొత్తానికి అమ్మింది ఇంకా తెలియాల్సి ఉంది. సెక్యూరిటీ గార్డు నుంచి జెర్సీలను కొనుగోలు చేసిన డీలర్‌ను విచారణ కోసం పోలీసులు హరియాణా నుంచి పిలిపించారు. అయితే జెర్సీలు దొంగిలించిన విషయం తనకు తెలియదని డీలర్ పోలీసులకు తెలిపాడు. 'కార్యాలయంలో జరుగుతున్న పునరుద్ధరణ పనుల కారణంగా, స్టాక్ క్లియరెన్స్‌లో భాగంగా జెర్సీలు అమ్మకానికి ఉన్నాయని గార్డు తనకు చెప్పాడు' అని ఆన్‌లైన్ డీలర్ పోలీసుల విచారణలో వాపోయాడు. చోరీకి గురైన వాటిలో 50 జెర్సీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీలర్ నుంచి నేరుగా తన బ్యాంకు ఖాతాకు డబ్బులు వచ్చాయని నిందితుడు తెలిపాడు. అయితే ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ఆ మొత్తాన్నీ పోగొట్టుకున్నానని అతడు తెలిపాడు. దీంతో ఆ సెక్యూరిటీ గార్డు బ్యాంక్ ఖాతాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. అయితే.. జెర్సీలు మిస్సయిన విషయమై జులై 17న బీసీసీఐ అధికారులు మెరైన్ డ్రైవ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.





## టీసీఎస్‌లో సీనియర్ల నియామకాలు నిలిపివేత..

టెక్ దిగ్గజం టీసీఎస్ సీనియర్ల నియామకాలను నిలిపేసినట్లు వార్తలొస్తున్నాయి. దీంతోపాటు వార్షిక వేతనాల పెంపును ఆపినట్లు ఆంగ్ల పత్రిక ఎకనామిక్ టైమ్స్ కథనం వెలువరించింది. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 12,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు సంస్థ సీఈవో కె.కృతివాసన్ ప్రకటించిన సమయంలో ఈ విషయం ప్రచారంలోకి రావడం గమనార్హం. ప్రస్తుతం ఐటీ రంగంలో డిమాండ్ తగ్గడం.. కృత్రిమ మేధ నుంచి ముప్పు పొంచి ఉండటం వంటి అంశాలు ఉద్యోగాలపై ప్రభావం చూపిస్తున్నాయి. పరిశ్రమలో పెద్ద కంపెనీగా ఉన్న టీసీఎస్ పాటించే వ్యూహాలను సాఫ్ట్‌వేర్ రంగంలోని ఇతర సంస్థలు కూడా అనుసరించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే నియమించుకొన్న సీనియర్లను కూడా జాయిన్ చేసుకోవడంలో జాప్యం చేస్తోంది. ఇక పుణే, హైదరాబాద్, చెన్నై, కోల్‌కత్తాలోని బెంచ్‌పై నియమిత కాలం కంటే ఎక్కువగా ఉన్న సిబ్బందిని తొలగించే ప్రక్రియను మొదలుపెట్టింది. ఇప్పటికే ఉద్యోగులు 35 రోజులకు మించి బెంచ్‌పై ఉండకూడదనే నియమాన్ని అమలుచేస్తోంది. ఇక కంపెనీలోని పరిణామాలపై ఆ సంస్థ ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. టీసీఎస్ చేపట్టిన వాటిల్లో మధ్య, సీనియర్ స్థాయి లేఆఫ్‌లే కంపెనీకి రూ.2,400 నుంచి రూ.3,600 కోట్ల వరకు ఆదా చేయనున్నాయి. కాకపోతే ఈ లేఆఫ్‌లను ఒక్కసారిగా కాకుండా.. మెల్లగా ఓ క్రమపద్ధతిలో అమలుచేస్తామని సీఈవో వెల్లడించారు. టీసీఎస్ కంపెనీ ఉద్యోగుల్లో 2 శాతం ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దాదాపు 12వేలకు పైగా ఉద్యోగాల కోత నిర్ణయంపై కేంద్ర ఐటీ మంత్రిత్వశాఖ దృష్టిసారించినట్లు తెలుస్తోంది. మొత్తం పరిస్థితిని కేంద్రం నిశితంగా గమనిస్తోందని, టెక్ కంపెనీతో టచ్‌లో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. గత ఏడాదికి పైగా వ్యవధిలో కంపెనీ షేరు 30 శాతం కుంగింది. నిఫ్టీ సూచీలోని ఐటీ షేర్లలో ఇదే బలహీనంగా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

## 30 నుంచి ఎన్ఎస్‌డీఎల్ ఐపీఓ.. జీఎంపీ 20% క్షీణత




డిపాజిటరీ సంస్థ నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ తొలి ఐపీఓపై ఊహించని పరిణామం చోటు చేసుకుంది. జులై 30న ఐపీఓ ప్రారంభంకానున్న నేపథ్యంలో ఎన్ఎస్‌డీఎల్ షేర్లకు సంబంధించిన గ్రే మార్కెట్ ప్రీమియం (జీఎంపీ) 20 శాతం క్షీణించింది. మార్కెట్‌లో పునరుద్ధరణ కనిపించినా.. ఐపీఓ ప్రకటన వెలువడినప్పటి నుంచి జీఎంపీ మందగించింది. మంగళవారం నాటికి జీఎంపీ రూ.130-135గా ఉంది. ఇది గతంలో రూ.165 వద్ద ఉండేది. ప్రస్తుత జీఎంపీ లెక్కల ప్రకారం.. లిస్టింగ్ సమయంలో 16-17 శాతం లాభాలు వచ్చే అవకాశం ఉంది. అయినప్పటికీ, మార్కెట్‌లో నెలకొన్న అమ్మకాల వల్ల ప్రీమియం గణనీయంగా తగ్గింది. అయితే, కంపెనీ మూలాలు బలంగా ఉండటంతో విశ్లేషకులు మాత్రం ఈ ఐపీఓ విషయంలో ఆశావాద దృక్పథంతో ఉన్నారు. దీని పోటీదారైన సీడీఎస్‌ఎల్‌తో పోలిస్తే ఎన్ఎస్‌డీఎల్ ధర సరసమైనదేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మార్చి 2025 నాటికి కంపెనీ డిమాట్ విలువలో 86.8 శాతం మార్కెట్ షేర్ కలిగి ఉంది. పెరుగుతున్న ఈక్విటీ కల్చర్, కొత్తగా ప్రవేశపెట్టబోయే ఉత్పత్తులు, అనుబంధ సంస్థల ద్వారా విస్తరించే వ్యాపారాలు ఇవన్నీ ఎన్ఎస్‌డీఎల్‌కు భవిష్యత్తులో మెరుగైన వృద్ధికి దోహదపడతాయని భావిస్తున్నారు. ఎన్ఎస్‌డీఎల్ పలు రంగాల్లో తన సర్వీసులను విస్తరించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా తీసుకొస్తున్న ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉంటుంది. ఒక్కో షేరుకు రూ.760-800గా కంపెనీ నిర్ణయించింది. అప్పర్ ప్రైస్ బ్రాండ్ వద్ద కంపెనీ రూ.4,011 కోట్లు సమీకరించ నుంది. మొత్తం 5.01 కోట్ల షేర్లను విక్రయించనుంది. ఉద్యోగులకు రూ.76 రాయితీ ఇవ్వనున్నారు. 50 శాతం షేర్లు క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయర్స్, 15 శాతం నాన్-ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు, 35 శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించనున్నారు. ఐసీఐసీఐ సెక్యూరిటీస్ లిమిటెడ్, యా క్సిస్ క్యాపిటల్, హెచ్ఎస్‌బీసీ హోల్డింగ్స్, ఐడీబీఐ క్యాపిటల్, మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్, ఎస్‌బీఐ క్యాపిట ల్ మార్కెట్ సంస్థలు ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఎన్ఎస్‌డీఎల్ నికర లాభం రూ.343 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం రూ.1,535 కోట్లుగా




# ఉస్తాద్ భగత్ సింగ్ క్లైమాక్స్ పార్ట్ పూర్తి

పవన్ కల్యాణ్ అభిమానులు ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'ఉస్తాద్ భగత్‌సింగ్' ఒకటి. పవన్ కల్యాణ్ – హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ అప్‌డేట్‌ను నిర్మాణసంస్థ తాజాగా షేర్ చేసింది. దీని –క్లైమాక్స్ పూర్తయినట్లు– తెలిపింది. పవన్ కల్యాణ్ ఎంతో అంకితభావంతో దీని షూటింగ్‌లో పాల్గొన్నారంటూ ఆయనకు కృతజ్ఞతలు చెప్పింది. ఎన్నో భావోద్వేగాలతో కూడిన ఉస్తాద్ భగత్‌సింగ్ క్లైమాక్స్ పూర్తయింది. నబకాంత మాస్టర్ పర్యవేక్షణలో యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ– సీఎంగా బాధ్యతలను నిర్వర్తిస్తూనే.. మరోవైపు 'హరి హర వీరమల్లు' ప్రచారంలో పవన్ కల్యాణ్ భాగమయ్యారు. అదే మెరుపు వేగంతో 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్‌లో కూడా పాల్గొన్నారు. ఇది ఆయన అంకితభావానికి, కష్టపడి పనిచేసే స్వభావానికి నిదర్శనమని నిర్మాణ సంస్థ తెలిపింది ఈ విషయాన్ని తెలుపుతూ సెట్‌లో పవన్, హరీశ్ శంకర్‌ల ఫొటోను పంచుకుంది. గబ్బర్ సింగ్' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో రానున్న చిత్రం కావడంతో దీనిపై సినీప్రియులు ఎన్నో అంచనాలు పెట్టుకున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, స్పెషల్ వీడియోలు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి. ఇక పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటించనున్నారు.

# బాహుబలి స్పెషల్..

## డేవిడ్ వార్నర్‌కు రాజమౌళి గిఫ్ట్



డేవిడ్ వార్నర్.. క్రికెట్ అభిమానులకే కాదు.. సినీప్రియులకు ఎంతో ఇష్టమైన వ్యక్తి. మైదానంలో అడుగుపెట్టాడంటే రెచ్చిపోయే ఈ ఆసీస్ బ్యాటర్ అదేస్థాయిలో తెలుగు సినిమా పాటలకు తనదైన స్టైల్‌లో డ్యాన్స్ వేస్తూ అలరిస్తుంటారు. 'బాహుబలి' సినిమాపై ఆయన చేసిన వీడియోలు కూడా అప్పట్లో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. ఇప్పుడీ క్రికెటర్‌కు మన దర్శకధీరుడు రాజ మౌళి 'బాహుబలి' కీరిటాన్ని పంపనున్నారు. ఇండియన్ సినిమాను అంత ర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది 'బాహుబలి' . ఈ చిత్రం విడుదలై 10 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో దీన్ని మరోసారి ప్రపంచ ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు. ఈ సందర్భంగా డేవిడ్ గతంలో తాను ధరించిన బాహుబలి కాస్ట్యూమ్ లుక్స్‌ను తాజాగా మరోసారి పంచుకున్నారు. 'కిరీటం ఉన్న ఫొటో బాగుందా? లేని పిక్ నచ్చిందా?' అని క్యాప్షన్ పెట్టారు. దీనికి రాజమౌళి రిప్లై ఇచ్చారు. "హాయ్ డేవిడ్.. మీరిప్పుడు మాహిష్మతి సామ్రాజ్యానికి నిజ మైన రాజులా తయారవ్వండి. నేను ఈ కిరీటాన్ని పంపుతున్నాను" అని అ న్నారు. దానికోసం ఎదురుచూస్తుంటానని క్రికెటర్ చెప్పారు. 'మీరు ఆస్ట్రేలి యాలో ఈ సినిమాను మరోసారి చూడండి' అని టీమ్ మరో కామెంట్ పె ట్టింది. దీనికి వార్నర్ ఓకే అంటూ థంబ్ పెట్టారు. రెండు భాగాలుగా అలరిం చిన ఈ బ్లాక్‌బస్టర్ ఇప్పుడు ఒకే పార్ట్‌గా రానుంది. 'బాహుబలి: ది ఎపిక్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఇది విడుదల కానున్న విషయం తెలిసిందే.

## 'బాహుబలి' వెబ్‌సిరీస్ ఆగిపోవడంపై..

# స్పందించిన దేవ కట్టా



తాను దర్శకత్వం వహించిన 'బాహుబలి' వెబ్‌సిరీస్ ఆగిపోవడంపై దేవ కట్టా స్పందించారు. అధిక సమయం వెచ్చించాల్సి రావడంతో నిలిపివేసినట్టు తెలిపారు. "రాజమౌళి విజన్‌తోనే భారీ తరహాలో ఆ సిరీస్‌ను ప్రారంభించాం. దాదాపు దశాబ్దం పాటు చేయాల్సిన ప్రాజెక్టు అది. స్క్రిప్టు రాయడానికే టీమ్‌కు చాలా సమయం పట్టేది. పక్కా స్క్రిప్టు లేకుండా షూటింగ్ చేయడం కష్టం. 'మనం సరైన దారిలో వెళ్లడం లేదేమో' అని ఒకానొక దశలో అందరం అనుకున్నాం. ఆపేయడమే బెటర్ అనే నిర్ణయానికొచ్చాం" అని తెలిపారు. బాహుబలి' సినిమాకి ప్రీక్వెల్‌గా ఆ వెబ్‌సిరీస్‌ని రూపొందించాలని ప్లాన్ చేశారు. ఆనంద్ నీలకంఠన్ రాసిన 'ది రైజ్ ఆఫ్ శివగామి', 'క్వీన్ ఆఫ్ మాహిష్మతి' నవలలు దానికి ఆధారం. ఆ సిరీస్‌ని 'బాహుబలి: బిఫోర్ ది బిగినింగ్' పేరిట ఓటీటీ 'నెట్‌ఫ్లిక్స్' సంస్థ కొన్నాళ్ల క్రితం ప్రకటించిన సంగతి తెలిసిందే. వామికా గబ్బీ, రాహుల్ బోస్, అతుల్ కులకర్ణి తదితరులు కీలక పాత్రలకు ఎంపికయ్యారు.



# నటి రమ్యకు అత్యాచార బెదిరింపులు

## కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ అసహనం

నటుడు దర్శన్ అభిమానులు తనను ఆన్‌లైన్‌లో వేధిస్తున్నారంటూ నటి రమ్య (దివ్య స్పందన) ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు పంపిస్తున్న అశ్లీల సందేశాలు, బెదిరింపులు, చిత్రాలు స్క్రీన్‌షాట్లను సైబర్ క్రైమ్ ఠాణా పోలీసులకు అందించారు. నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్‌కు షేర్ చేశారు. నటీమణి పవిత్రా గౌడపై చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి చేసిన వ్యాఖ్యలకు– దర్శన్ అభిమానులు తనకు పంపిస్తున్న సందేశాలకు ఎటువంటి తేడా లేదని రమ్య ఆక్రోశించారు. స్త్రీ ద్వేషాన్ని కలిగిన వారితోనే మహిళలు, యువతులు వేధింపులకు గురవుతున్నారని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో నటి రమ్యకు కన్నడ స్టార్ నటుడు శివరాజ్‌కుమార్ మద్దతుగా నిలిచారు. ఇలాంటి చర్యలు ఎంతమాత్రం ఆమోద యోగ్యం అన్నారు. "రమ్యకు వ్యతిరేకంగా పెడుతున్న పోస్టులు, వాడిన పదాలను నేను ఖండిస్తున్నా. ఏ మహిళ పైనా ఇలా మాట్లాడటం సరికాదు. దానిని మనం సహించకూడదు. మహిళలను తల్లిగా, అక్కగా, కూతురిగా, భార్యగా అన్నింటికంటే ముందుగా ఒక వ్యక్తిగా గౌరవించటం చాలా ముఖ్యం. సామాజిక మాధ్యమం ఒక బలమైన అస్త్రం. దానిని తమ అభిప్రాయాలు వ్యక్తపరిచేందుకు ఉపయోగించాలి. అంతేకానీ అసభ్య పదాలు, నిందలు, ద్వేషం, అసూయవంటి వాటికి దూరంగా ఉ ండాలి. నువ్వు ఎంచుకున్న మార్గం సరైనది రమ్య. నీకు మేమంతా సదా తోడుగా ఉంటాము"అని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

## సతీలీలావతిగా

# లావణ్య త్రిపాఠి

లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధానపాత్రల్లో రానున్న చిత్రం 'సతీ లీలావతి' తాతినేని సత్య ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. తాజాగా దీని టీ-జర్‌ను టీ-మ్ విడుదల చేసింది. సోషల్ మీడియాలో వచ్చే కౌంటర్స్, సరదాగా సాగే పంచ్‌లతో ఈ వీడియో నవ్వులు పూయిస్తోంది. మిక్కీ జే మేయర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటించనున్నారు.







# మహావతార్ నరసింహ అద్భుతం

## చిత్ర బృందాన్ని మెచ్చుకున్న ప్రభాస్

ప్రస్తుతం భారతీయ బాక్సాఫీస్ వద్ద పురాణగాథలకు మంచి డిమాండ్ ఉంది. తెలిసిన కథే అయినా ఆసక్తికరంగా తీర్చిదిద్ది అందిస్తే ప్రేక్షకులు ఆదరిస్తున్నారని ఇటీవల పలు సినిమాలు నిరూపించాయి. ఇప్పుడు ఇదే బాటలో పయనిస్తోంది 'మహావతార్ నరసింహ', ప్రముఖ నిర్మాణసంస్థ హోంబలే ఫిల్మ్స్ నుంచి వచ్చిన ఈ విజువల్ వండర్‌కు చిన్నా, పెద్దా అందరూ ఫిదా అవుతున్నారు. ముఖ్యంగా 3డీలో సరికొత్త అనుభూతిని పంచుతోంది. తాజాగా మూవీని చూసిన అగ్ర కథానాయకుడు ప్రభాస్ చిత్ర బృందాన్ని మెచ్చుకున్నారు. పవర్‌ఫుల్ విజన్‌తో 'మహావతార నరసింహ'ను వాస్తవంలోకి తీసుకొచ్చిన హోంబలే ఫిల్మ్స్‌కు శుభాకాంక్షలు. సినిమా నాకెంతో నచ్చింది. యానిమేషన్ రూపంలో తీర్చిదిద్దిన యాక్షన్ సన్నివేశాలు, కథాగమనం అద్భుతంగా ఉ న్నాయి. ఈ అపురూప విజయం సాధించిన దర్శకుడు అశ్విన్‌కుమార్, చిత్ర బృందానికి అభినందనలని పేర్కొన్నారు. ప్రభాస్ పోస్టుకు హోంబలే చిత్రబృందం స్పందించింది. సినిమాపై ఆయన అభిప్రాయంపై కృతజ్ఞతలు తెలిపింది.

## కింగ్డమ్ నుంచి రగిలే రగిలే

# లిరికల్ సాంగ్ విడుదల

## తమిళంలో వాయిస్ ఓవర్ ఇచ్చిన సూర్య




విజయ్ దేవరకొండ ప్రధానపాత్రలో రానున్న 'కింగ్డమ్' గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కింది. భాగ్య శ్రీ బోర్సే కథానాయికగా కనిపించనున్నారు. జులై 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా 'రగిలే రగిలే' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు 'మృత్యువు జడిసేలా.. శత్రువు బెదిరేలా..పద పద..' అనే పవర్‌ఫుల్ లిరిక్స్‌ను కృష్ణకాంత్ రాయగా.. సిద్ధార్థ్ బస్రూర్ ఆలపించారు. ఈసందర్భంగా చెన్నైలో ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌ను ఏర్పాటు–చేశారు. అందులో విజయ్ మాట్లాడుతూ హీరో సూర్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టీ–జర్‌కు వాయిస్ ఓవర్ ఇస్తారా అని అడగ్గానే అంగీకరించారని తెలిపారు. కింగ్డమ్' కథ అనుకోగానే దీన్ని తమిళంలో కూడా కచ్చితంగా విడుదల చేయాలని భావించాం. ఈ సినిమా విడుదలకు ముందు ముఖ్యంగా ఇద్దరికి కృతజ్ఞతలు చెప్పాలి. వారిలో ఒకరు హీరో సూర్య. నాకు మొహమాటం ఎక్కువ. ఎవరిని సాయం అడగలేను. 'కింగ్డమ్' తమిళ టీజర్‌కు సూర్య వాయిస్ ఇస్తే బాగుంటుందని దర్శకుడు తెలిపారు. నేను ఈ మాట అడగ్గానే సూర్య ఓకే చెప్పారు. ఆయన పవర్‌ఫుల్ వాయిస్ టీజర్‌ను మరింత పవర్‌ఫుల్‌గా చేసింది. థాంక్యూ సూర్య అన్న అని అన్నారు. ఇక రెండో వ్యక్తి మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్.. అతడు ఈ సినిమాకు ప్రాణం పెట్టాడు. ఇప్పటికీ దీని పనుల్లోనే బిజీగా ఉన్నాడు. అతడిని కిడ్నాప్ చేసి నాతోపాటే ఉంచుకోవాలని ఉంది. ఈ సినిమా విషయంలో నేను చెప్పిన అప్‌డేట్స్ కంటే అనిరుధ్ చెప్పినవే వైరల్ అయ్యాయి. ఇటీ–వల జరిగిన ఈవెంట్‌లో కూడా ఈ చిత్రం మా అందరికీ మైల్‌స్టోన్ అవుతుందని అనిరుధ్ చెప్పాడు. ఆ మాటనే ఎంతోమంది షేర్ చేశారు. మరో రెండు రోజుల్లో 'కింగ్డమ్' మీ ముందుకురానుంది. మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను అని తెలిపారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com